



గొలుగొండ మండలం కృష్ణాదేవిపేటలో అల్లూరి సీతారామరాజు, గాం గంటం దొర సమాధులు

ప్రజా సమస్యలపై వాడీవేడిగా చర్చ

జిల్లా అభివృద్ధిపై డీఆర్‌సీలో సభ్యుల సలహాలు, సూచనలు

- జిల్లా యూనిట్‌గా అన్ని అసెంబ్లీ నియోజకవర్గాలు అభివృద్ధి
- ఖరీఫ్ ఆరంభం అయ్యేలోగా సాగునీటి వనరులకు మరమ్మతులు
- జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొల్లు రవీంద్ర



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కొల్లు రవీంద్ర. చిత్రంలో స్పీకర్ అయ్యన్నపాత్రుడు, శాసనమండలి విపక్ష నేత బొత్స సత్యనారాయణ, ఎమ్మెల్యేలు బండారు, సుందరపు, కలెక్టర్ విజయకృష్ణన్, ఎస్పీ తుహిన్ సిన్హా, జేసీ జాహ్నవి ఉన్నారు.

అనకాపల్లి, మే 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో నెలకొన్న వివిధ రకాల సమస్యలపై సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొల్లు రవీంద్ర అధ్యక్షతన జరిగిన జిల్లా సమీక్షా మండలి (డీఆర్‌సీ) సమావేశంలో ప్రజాప్రతినిధులు, అధికారులు చర్చించారు. సాగు, తాగునీటి సమస్యలు, గోవాడ షుగర్ ఫ్యాక్టరీ కార్మికులు, చెరకు రైతులకు బకాయిల చెల్లింపు, అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రిలో అవినీతి, చోడవరం, మాడుగుల, పాయకరావుపేట నియోజకవర్గాలకు నిధుల కేటాయింపుల్లో ప్రాధాన్యం ఇవ్వకపోవడం వంటి అంశాలపై వాడీవేడిగా చర్చ జరిగింది. ప్రజా సమస్యల పరిష్కారం, జిల్లా అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై పలువురు సభ్యులు సూచనలు, సలహాలు అందించారు. తొలుత కలెక్టర్ విజయకృష్ణన్.. జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, అమలు చేస్తున్న ప్రణాళికలు, గత సమావేశంలో చర్చించిన అంశాలపై తీసుకున్న చర్యల గురించి వివరించారు. అనకాపల్లిలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటుకు ప్రభుత్వానికి ప్రతిపాదన చేయనున్నట్టు తెలిపారు. అనంతరం మంత్రి రవీంద్ర మాట్లాడుతూ, జిల్లాను ఒక యూనిట్‌గా తీసుకొని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాలను అభివృద్ధి చేయాలని సీఎం చంద్రబాబు సూచించారని, దీనికి అవసరమైన ప్రణాళికలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ఖరీఫ్ సీజన్ ఆరంభం అయ్యేలోగా సాగునీటి వనరులకు మరమ్మతులు, అభివృద్ధి పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలోని వనరులను వినియోగించుకొని యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించి, జీడీపీఎస్‌ను పెంచాల్సిన అవసరం ఉందన్నారు.

శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ, జిల్లా సమీక్షా మండలి సమావేశాల్లో ఒక్కోసారి ఒక్కో అంశంపై విస్తృతంగా చర్చ జరగాలని సూచించారు. తాగునీటి సమస్యలపై ప్రజలపై ఫిర్యాదులు స్వీకరించేందుకు ప్రత్యేక సెల్ ఏర్పాటు చేయాలన్నారు. గ్రామ పంచాయతీలకు సరఫరా చేస్తున్న వస్తువులు మార్కెట్ రేటు కంటే ఎక్కువగా ఉంటున్నాయని, అందువల్ల పంచాయతీకి కావాల్సిన వస్తువులను సర్పంచులే నేరుగా కొనుగోలు చేసుకొనే అవకాశం ఇవ్వాలన్నారు.

- తాగునీటి సమస్యలపై ఫిర్యాదుల స్వీకరణకు ప్రత్యేక సెల్
- స్పీకర్ అయ్యన్నపాత్రుడు సూచన
- గోవాడ షుగర్స్ కార్మికులు, రైతులకు బకాయిలు ఎప్పుడిస్తారు?
- ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ నిలదీత
- గ్రామీణ నియోజకవర్గాలకు అధిక నిధులివ్వాలి
- ఎమ్మెల్యే బండారు వినతి
- ఎన్టీఆర్ ఆస్పత్రిలో అవినీతిపై విచారణ జరపాలి
- ఎమ్మెల్సీ వరుదు కల్యాణి డిమాండ్

శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ, గోవాడ షుగర్ ఫ్యాక్టరీ కార్మికులు, చెరకు సరఫరా చేసిన రైతులకు సుమారు రూ.40 కోట్ల బకాయిలు వున్నాయని, వీటిని ఎప్పుడు చెల్లిస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు. జిల్లా మినరల్ ఫండ్ నిధులు అన్ని మండలాలకు సమానంగా అందేలా చర్యలు చేపట్టాలని కోరారు. మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ, షుగర్ ఫ్యాక్టరీ కార్మికులు, చెరకు రైతుల సమస్యపై స్థానిక ఎమ్మెల్యేలతో కలిసి సీఎం చంద్రబాబునాయుడుతో చర్చించి రైతులకు న్యాయం చేస్తామని చెప్పారు.

మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ, ఇటీవల ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి రూ.3 కోట్లు చొప్పున నాబార్డు నిధులు కేటాయించారని, పూర్తిగా గ్రామీణ ప్రాంతమైన మాడుగుల, చోడవరం, పాయకరావుపేట నియోజకవర్గాలకు.. మునిసిపల్ కార్పొరేషన్లు వున్న నియోజకవర్గాలకు ఒకే విధంగా నిధులు కేటాయించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. దీనిపై ఇన్‌చార్జి మంత్రి ఆలోచన చేసి గ్రామీణ ప్రాంత నియోజకవర్గాలకు అధిక నిధులు కేటాయించాలని కోరారు.

చోడవరం ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు మాట్లాడుతూ, సుజల స్రవంతి ప్రాజెక్టు భూసేకరణ విషయంలో ప్రజల నుంచి వ్యతిరేకత రాకుండా ముందుగానే తగు చర్యలు చేపట్టాలని సూచించారు. ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ మాట్లాడుతూ, నియోజకవర్గంలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఖాళీగా ఉన్న వైద్య సిబ్బంది పోస్టులను భర్తీ చేయాలని కోరారు.

ఎన్టీఆర్ ఆస్పత్రిలో అవినీతిపై విచారణ జరపాలి

జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ ఆస్పత్రి ప్రసూతి విభాగం సిబ్బంది, రోగుల సహాయకుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారని ఎమ్మెల్సీ వరుదు కల్యాణి ఆరోపించారు. కలెక్టర్ విజయకృష్ణన్ స్పందిస్తూ.. గతంలో ఒక పేషెంట్ నుంచి కొంత సొమ్ము వసూలు చేసినట్టు ఫిర్యాదు రాగా.. ఒక ఉద్యోగిని సస్పెండ్ చేశామన్నారు. మళ్లీ వరుదు కల్యాణి మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఉన్న ఒక వృద్ధురాలిని ... మిగతా 6వ పేజీలో

జిల్లా సమగ్ర అభివృద్ధే లక్ష్యం

మండలం యూనిట్‌గా వస్తుసేవలు, జీడీపీ వృద్ధి

- గోవాడ షుగర్ ఫ్యాక్టరీపై సీఎంతో చర్చిస్తాం
- జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొల్లు రవీంద్ర



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొల్లు రవీంద్ర

అనకాపల్లి, మే 5 (ఆంధ్రజోతి): జిల్లా సమగ్ర అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని, ఇందులో భాగంగానే జిల్లా అభివృద్ధి సమీక్షలు నిర్వహిస్తున్నామని రాష్ట్ర గనులు, ఎక్సైజ్ శాఖలు, జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్‌లో డీఆర్‌సీ సమావేశం నిర్వహించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రతి మండలాన్ని ఒక యూనిట్‌గా తీసుకొని వస్తుసేవల ఉత్పత్తి, ఉత్పాదకత, జీడీపీని పెంచేందుకు అవసరమైన ప్రణాళికతో ముందుకు వెళుతున్నామని చెప్పారు. వేసవిలో ఎక్కడా తాగునీటికి ప్రజలు ఇబ్బంది పడకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించామన్నారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపర్చేందుకు, ప్రజల ఆర్థిక ఎదుగుదలకు జిల్లాలో ఎటువంటి అవకాశాలు ఉన్నాయన్న దానిపై అధ్యయనం జరగుతున్నని చెప్పారు. గోవాడ షుగర్ ఫ్యాక్టరీ గురించి జిల్లాకు చెందిన అందరు ఎమ్మెల్యేలతో కలిసి సీఎం చంద్రబాబునాయుడుతో కలిసి చర్చిస్తామన్నారు. అన్ని ప్రభుత్వ శాఖలతో ప్రతి నెలా సమీక్షలు జరుపుతామన్నారు. పదో తరగతిలో మెరుగైన ఫలితాలు సాధించడం అభినందనీయమన్నారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్, వెలమ కార్పొరేషన్ ఛైర్మన్ పీవీజీ కుమార్, గవర కార్పొరేషన్ ఛైర్మన్ మళ్ల సురేంద్ర పాల్గొన్నారు.

అల్లూరి పార్కు అభివృద్ధికి రూ.10 లక్షలు మంజూరు

- విజయనగరం ఎంపీ నిధుల నుంచి కేటాయింపు

నర్సీపట్నం, మే 5 (ఆంధ్రజ్యోతి): గొలుగొండ మండలం కృష్ణాదేవిపేటలో అల్లూరి పార్కు అభివృద్ధికి శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు చేసిన కృషి ఫలించింది. అల్లూరి సీతారామరాజు, గాం గంటందొర సమాధులున్న పార్కు అభివృద్ధికి విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు ఎంపీ ల్యాడ్స్ నుంచి రూ.10 లక్షలు మంజూరు చేశారు. బుధవారం అల్లూరి వర్ధంతి నేపథ్యంలో నిధులు మంజూరుకావడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా ఎంపీ అప్పలనాయుడును స్పీకర్ అయ్యన్న అభినందించారు.



నక్కపల్లిలో కొత్తగా నిర్మించిన హాకీ మైదానం

నేడు హాకీ మైదానం ప్రారంభం

నక్కపల్లి, మే 5 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో సుమారు రూ 1.7 కోట్ల వ్యయంతో నిర్మించిన సింథటిక్ ఆస్ట్రో టర్ఫ్ హాకీ మైదానాన్ని మంగళవారం మంత్రి వంగలపూడి అనిత ప్రారంభించనున్నారు. జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో హాకీ క్రీడాకారులు మెరుగైన సాధన చేసేందుకు హైస్కూల్ గ్రౌండ్‌లో మైదానాన్ని నిర్మించారు. ఎనిమిదేళ్ల కిందట నక్కపల్లిలో బీఎస్ హాకీ క్లబ్‌ను బలిరెడ్డి సూరిబాబు, కొల్నాటి తాతాజీ, చిన్న అప్పారావు తదితరులు స్థాపించారు. ఇక్కడ తర్ఫీదు పొందిన ఎంతో మంది క్రీడాకారులు జాతీయ, రాష్ట్రస్థాయి పోటీల్లో రాణించారు. సింథటిక్ ఆస్ట్రో టర్ఫ్ హాకీ మైదానం అందుబాటులోకి రానుండడంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

పల్లె పండుగ బకాయిలు రూ.20 కోట్లు

- నర్సీపట్నం నియోజకవర్గంలో రూ.42 కోట్లతో 521 పనులు మంజూరు
- రూ.27.36 కోట్ల విలువైన 452 పనులు పూర్తి
- బిల్లుల కోసం నిరీక్షిస్తున్న కాంట్రాక్టర్లు

ఆరు నెలల నుంచి విడుదల కాని బిల్లులు



గొలుగొండ మండలం పాతమల్లంపేట నుంచి అంటిమానిజోర్లుకి వేసిన సీసీ రోడ్డు

నర్సీపట్నం, మే 5 (ఆంధ్రజ్యోతి):

'పల్లె పండగ' కార్యక్రమం కింద గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులను ఆరు నెలల నుంచి బిల్లులు మంజూరు కావడం లేదు. దీంతో ఆయా పనులు చేసిన కాంట్రాక్టర్లు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. నర్సీపట్నం నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో పూర్తయిన పనులకు సంబంధించి సుమారు 20 కోట్ల రూపాయల మేర బిల్లులు పెండింగ్‌లో వున్నాయని అధికారులు చెబుతున్నారు.

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా అధికారులు గత ఏడాది అక్టోబరు 14వ తేదీ నుంచి 20వ తేదీ వరకు పల్లె పండుగ వారోత్సవాలు నిర్వహించారు. ఉపాధి హామీ పథకం కన్వర్జెన్సీ నిధులతో అన్ని గ్రామాలలో సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువలు, రహదారులకు మరమ్మతు వంటి పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. పనులు పూర్తి చేసిన కాంట్రాక్టర్లకు సత్వరమే బిల్లుల చెల్లింపు జరుగుతుందని అధికారులు చెప్పారు. నర్సీపట్నం నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో రూ.42.29 కోట్లతో 521 పనులు చేయాలని నిర్ణయించారు. ఏ పని కూడా రూ.10 లక్షలకు మించకపోవడంతో నామినేటెడ్ విధానంలో కాంట్రాక్టర్లకు అప్పగించారు. వివిధ కారణాల వల్ల 18 పనులు ఇంకా మొదలు పెట్టలేదు. రూ.27.36 కోట్ల విలువ చేసే 452 పనులు పూర్తి చేశారు. ప్రస్తుతం రూ.12 కోట్లు విలువైన 51 పనులు జరుగుతున్నాయి. అయితే పనులు చేపట్టిన కాంట్రాక్టర్లకు గత ఏడాది నవంబరు చివరి వారం, డిసెంబరు మొదటి వారంలో స్వల్పంగా బిల్లులు మంజూరయ్యాయి. ఆ తరువాత నుంచి ఇంతవరకు బిల్లులు మంజూరు కాలేదు. దీనిపై పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం డీఈ ఈశ్వరరావును 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా.. 'పల్లె పండుగ' పనుల బిల్లులు ఈ నెలాఖరులోగా మంజూరవుతాయని చెప్పారు.

మండలాల వారీగా చేపట్టిన పనులు,

నర్సీపట్నం మండలంలో రూ.5 కోట్ల విలువ చేసే 57 అభివృద్ధి పనులు మంజూరు కాగా రూ.3.65 కోట్లతో 48 పనులు పూర్తి చేశారు. రూ.1.48 కోట్లతో తొమ్మిది పనులు ... మిగతా 6వ పేజీలో

ఈపీడీసీఎల్ అత్యుత్సాహం



ఈపీడీసీఎల్ ప్రధాన కార్యాలయం

ఆర్ఈసీఎస్ ఉద్యోగులకు అడ్డగోలుగా జీతాల పెంపు

- ఇప్పుడు 2022 పీఆర్‌సీ వర్తింపు
- పాత తీర్మానాల ప్రకారమే చేశామని అధికారుల బుకాయింపు
- కలెక్టర్ పర్సన్ ఇన్‌చార్జిగా ఉన్నా ఆగని అక్రమాలు
- ప్రస్తుతం వాచ్‌మన్ జీతం రూ.71,980, డ్రైవర్‌కు రూ.78,171, అటెండర్‌కు రూ.90 వేలు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

అనకాపల్లి గ్రామీణ విద్యుత్ సహకార సంస్థ (ఆర్ఈసీఎస్)ను తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఈపీడీసీఎల్)లో విలీనం చేసినా అక్రమాలు ఆగడం లేదు. సొసైటీ చట్టం కింద ఆర్ఈసీఎస్ ఏర్పాటైంది. అక్కడ వచ్చే లాభాల ఆధారంగా జీతాలు నిర్ణయిస్తారు. అందులో ఆర్థిక అక్రమాలు జరిగాయని తేలడంతో మేనేజింగ్ డైరెక్టర్‌ను ప్రభుత్వం సస్పెండ్ చేసింది. సొసైటీని తీసుకువెళ్లి ఈపీడీసీఎల్‌కు అప్పగించింది. ఇప్పుడు అక్కడి ఉద్యోగులకు పే రివిజన్ కమిషన్ (పీఆర్‌సీ)-2022 జీతాలు ఇవ్వడానికి రంగం సిద్ధం చేశారు. ఒక్కో ఉద్యోగికి నెలకు రూ.10 వేల నుంచి రూ.30 వేలు పెరుగుతుంది. గతంలో పాలకవర్గం తీర్మానం చేసి జీతాలు పెంచేది. ఇబ్బంది ఉండేది కాదు. ఇప్పుడు పాలకవర్గం లేదు. ఎలా జీతాలు పెంచారనేదే ప్రశ్న

ప్రస్తుతం సొసైటీలో పనిచేసే వాచ్‌మన్ జీతం నెలకు రూ.71,980. డ్రైవర్‌కు రూ.78,171. అటెండర్‌కు రూ.90 వేలు. ప్రాజెక్ట్ ఇంజనీర్ జీతం రూ.2.35 లక్షలు. ఇలా లైన్‌మెన్, అసిస్టెంట్ లైన్‌మెన్, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు మొత్తం 120 మంది నెలకు రూ.1.12 కోట్లు జీతం కింద తీసుకుంటున్నారు. వీరు కాకుండా మరో 492 మంది కాంట్రాక్టు పేమెంట్ వర్కర్లు ఉన్నారు. వీరికి జీతాల కింద రూ.2.16 కోట్లు చెలిస్తున్నారు. కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేసే వాచ్‌మన్ జీతం రూ.7,500 కాగా రెగ్యులర్ వాచ్‌మన్‌కు రూ.72 వేలు ఇస్తున్నారు. అంటే పదింతలు ఎక్కువ.

పాత రికమెండేషన్ ప్రకారం ఇచ్చేస్తున్నారు

ఈపీడీసీఎల్ ఉద్యోగులు ప్రభుత్వ సంస్థకు చెందినవారు. వారికి పే రివిజన్ కమిషన్ వర్తిస్తుంది. ఆర్ఈసీఎస్ సహకార సంస్థ. వారికి అటువంటివేమీ లేదు. కానీ గతంలో ఈపీడీసీఎల్ ఉద్యోగులకు పీఆర్‌సీ ఇచ్చినప్పుడల్లా ఆర్ఈసీఎస్ ఛైర్మన్, ఎండీ ఒక తీర్మానం చేసి అక్కడి ఉద్యోగులకు కూడా పీఆర్‌సీ ప్రకారం జీతాలు ఇచ్చేసేవారు. అంతా కుమ్మక్కు కావడం వల్ల ఎవరూ ప్రశ్నించలేదు. ఇన్నాళ్లూ నడిచిపోయింది. అయితే మూడేళ్ల క్రితం ఆర్ఈసీఎస్‌ను ఈపీడీసీఎల్‌కు అప్పగించింది. ఆపరేషన్ వ్యవహారాలన్నీ ఈపీడీసీఎల్ చూస్తోంది. బిల్లులు కూడా వసూలు చేసి అక్కడి ఉద్యోగులకు జీతాలు ఇస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం 2022లో పీఆర్‌సీ ఇచ్చింది. అప్పటికే ఆర్ఈసీఎస్ వ్యవహారాలపై కోర్టు వివాదాలు నడుస్తుండడంతో దాని గురించి ... మిగతా 6వ పేజీలో

ఖాకీ అడ్డదారి!



రక్షణకు కేటాయించిన గన్‌మెన్‌కు ఇంటి పనులు అప్పగింత

- పెంపుడు కుక్కలను సాకేదీ వారే
- పెందుర్తిలో విలాసవంతమైన భవన నిర్మాణం
- చింతపల్లి మండలం అన్నవరంలో మరో నిర్మాణం
- ఏసీబీకి అందిన ఫిర్యాదు



పోలీసు అధికారి కొత్త ఇంటిలో కార్పెంటరీ పనులు చేస్తున్న గన్‌మెన్

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

అతనో పోలీస్ అధికారి. మావోయిస్టులకు సంబంధించిన కీలకమైన సమాచారాన్ని సేకరించగలిగినందుకు శాఖాపరంగా ప్రత్యేక గుర్తింపు లభించింది. ప్రభుత్వం రెండు పదోన్నతులు ఇచ్చింది. అయితే మావోయిస్టుల నుంచి ముప్పు ఉందని భావించి ఆయన రక్షణకు సుమారు పది మంది గన్‌మెన్‌ను కేటాయించింది. అయితే సదరు అధికారి...వారితోనే ఇంటి పనులు (పెంపుడు కుక్కను సాకడం, ఇంటీరియర్, కార్పెంటర్ పనులు చేసేవారికి సహాయకులు ఉండడం) కూడా అప్పగిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

పోలీస్ శాఖలో చిరుద్యోగిగా విధుల్లో చేరిన ఆయన ఉమ్మడి విశాఖ జిల్లాలోని పలు స్టేషన్లతో పాటు మావోయిస్టుల వ్యవహారాలను పర్యవేక్షించే విభాగంలో పని చేశారు. ఆ సమయంలో మావోయిస్టులకు సంబంధించిన కీలక సమాచారాన్ని సేకరించి ఉన్నతాధికారులకు అందించారు. దీంతో ఆయనకు రెండుసార్లు యాగ్జిలరీ ప్రమోషన్లు (ప్రత్యేక పదోన్నతి) లభించి, ప్రస్తుతం ఉన్నత హోదాలో ఉన్నారు. ప్రభుత్వం అతని భద్రతకు సుమారు పది మంది గన్‌మన్‌ను కేటాయించింది. ఆ తరువాత నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలో పోస్టింగ్ ఇచ్చింది. ఆ సమయంలో అనేక అవినీతి ఆరోపణలు వచ్చాయి. రికవరీల్లో కొంత ఇవ్వాలని ఎస్‌ఐలపై ఒత్తిడి చేసేవారని, స్క్రాప్ దుకాణాల నుంచి నెలవారీ మామూళ్లు వసూలు చేయాలని ఆదేశించే వారని ఆరోపణలున్నాయి. ఇటీవల ... మిగతా 6వ పేజీలో



పెందుర్తి సమీపంలోని చినముషిడివాడలో నిర్మాణంలో ఉన్న భవనం

పాఠశాలల పరిరక్షణకు ఏపీటీఎఫ్ ధర్నా



చోడవరంలో ధర్నా చేస్తున్న ఏపీటీఎఫ్ ప్రతినిధులు, ఉపాధ్యాయులు

ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణ పేరిట సోమవారం జిల్లాలోని పలు కేంద్రాల్లో ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో ధర్నాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ నాయకులు మాట్లాడుతూ, వివిధ రకాల పేర్లతో ప్రాథమిక పాఠశాలలను నిర్వీర్యం చేయడం తగదని అన్నారు. ఒకటి నుంచి ఐదో తరగతి వరకు ప్రాథమిక పాఠశాలలను కొనసాగించాలని, విద్యార్థుల సంఖ్యతో సంబంధం లేకుండా కనీసం ఇద్దరు ఎస్‌జీటీలను వుంచాలని, రాష్ట్రమంతటా ఏకరీతిలో పదోన్నతుల సీనియారిటీ జాబితా రూపొందించాలని కోరారు. అన్ని పాఠశాలల్లో మాతృభాషా విధానం కొనసాగించాలని,సీపీఎస్, జీపీఎస్‌లను రద్దు చేయాలని, ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని, 12వ పీఆర్‌సీని వెంటనే నియమించి ఐఆర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. అనంతరం అధికారులకు వినతిపత్రాలు అందించారు.

ప్రజా సమస్యలపై వాడీవేడిగా చర్చ

... 5వ పేజీ తరువాయి

చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తీసుకెళితే ఆమె మృతిచెందిందని, అక్కడ వున్న సిబ్బంది ఆమె చెవి దుద్దులు చోరీ చేశారని అన్నారు. ఎస్పీ తుహిన్ సిన్హా స్పందిస్తూ.. దీనిపై కేసు నమోదు చేసి, విచారణ జరుపుతున్నామన్నారు. సమీక్షా సమావేశానికి ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, జీవీఎంసీ మేయర్ పీలా శ్రీనివాసరావు, వివిధ కార్పొరేషన్‌ల చైర్మన్లు బత్తుల తాతయ్యబాబు, గండి బాబ్జీ, మళ్ల సురేంద్ర, పీవీజీ కుమార్, జేసీ జాహ్నవి, అధికారులు హాజరయ్యారు.

పల్లె పండగ బకాయిలు రూ.20 కోట్లు

... 5వ పేజీ తరువాయి

జరుగుతున్నాయి. కాంట్రాక్టర్లకు రూ.3.22 కోట్ల బిల్లులు రావాల్సి వుంది.

నాతవరం మండలంలో రూ.15 కోట్ల విలువ చేసే 167 పనులు మంజూరు కాగా రూ.9.42 కోట్లతో 142 పనులు పూర్తి చేశారు. ఇంకా రూ.4.82 కోట్ల విలువ చేసే 22 పనులు వివిధ దశల్లో ఉన్నాయి. రూ.79 లక్షల విలువైన మూడు పనులు మొదలు పెట్టలేదు. కాంట్రాక్టర్లకు రూ.6.26 కోట్ల మేర బకాయిలు వున్నాయి..

గొలుగొండ మండలంలో రూ.9.72 కోట్ల విలువైన 170 పనులు మంజూరయ్యాయి. రూ.6.25 కోట్లతో 156 పనులు పూర్తి చేశారు. రూ.2.44 కోట్ల విలువైన ఎనిమిది పనులు జరుగుతున్నాయి. రూ.కోటి విలువైన ఆరు పనులు మొదలు కాలేదు. కాంట్రాక్టర్లకు రూ.4.85 కోట్లమేర బిల్లులు పెండింగ్‌లో వున్నాయి.

మాకవరపాలెం మండలంలో రూ.12.41 కోట్లతో 127 అభివృద్ధి పనులు మంజూరయ్యాయి. రూ.8 కోట్లతో 106 పనులు పూర్తి చేశారు. రూ.3.61 కోట్ల విలువ చేసే 12 పనులు కొనసాగుతున్నాయి. రూ.75 లక్షల విలువ చేసే తొమ్మిది పనులు మొదలు కాలేదు. కాంట్రాక్టర్లకు సుమారు రూ.6 కోట్ల వరకు బకాయిలు వున్నాయి.

ఖాకీ అడ్డదారి!

... 5వ పేజీ తరువాయి

ప్రత్యేక ఇంటెలిజెన్స్ విభాగానికి బదిలీ అయ్యారు.

సొంత పనులకు గన్‌మెన్

కాగా సదరు అధికారి రక్షణ కోసం ప్రభుత్వం కేటాయించిన గన్‌మెన్‌ను వ్యక్తిగత పనులకు వినియోగిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పెందుర్తి సమీపంలో ఈ అధికారి ఓ భవనాన్ని నిర్మిస్తున్నారు. అందులో ఇంటీరియర్, కార్పెంటర్ పనులు చేస్తున్న వారికి సహాయకులుగా ఉండాలని ఇద్దరు గన్‌మెన్‌ను ఆదేశించారు. పెంపుడు కుక్కలను చూసుకునే బాధ్యత కూడా గన్‌మెన్‌లకే అప్పగించారని తెలిసింది. అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి మండలం అన్నవరం వద్ద గిరిజనుడి పేరుతో ప్రైవేటు రిసార్టు నిర్మిస్తున్నారనే ఆరోపణలున్నాయి. వీటిపై కొందరు ఇటీవల ఆధారాలతో సహా ఏసీబీకి ఫిర్యాదు చేయడంతో వారు ప్రత్యేక దృష్టిసారించారని పోలీస్ శాఖలో ప్రచారం జరుగుతోంది.

ఈపీడీసీఎల్ అత్యుత్సాహం

... 5వ పేజీ తరువాయి

అక్కడి ఉద్యోగులు ఎవరూ మాట్లాడలేదు. ఇప్పుడు స్థానిక నేతలను పట్టుకున్నారు. పాత తీర్మానాల ప్రకారం పీఆర్‌సీని అమలు చేస్తూ జీతాలు ఇచ్చేయడానికి రంగం సిద్ధం చేశారు. ఇందుకు అనకాపల్లి ఎస్ఈ ప్రతిపాదనలు పంపడం, విశాఖలోని కార్పొరేట్ కార్యాలయం ఆమోదించడం జరిగిపోయింది. ఇంతలో లుకలుకలు మొదలు కావడంతో ఒక అడుగు వెనక్కి వేశారు. అయితే ఇప్పటికే చాలామంది ఉద్యోగుల బ్యాంకు ఖాతాల్లో పెరిగిన జీతాలు పడిపోయాయి. ఎవరూ నోరు విప్పడం లేదు.

అది చట్ట విరుద్ధం

సొసైటీలో అర్హతల ప్రామాణికంగా కాకుండా రాజకీయ సిఫారసులతో ఉద్యోగాలు ఇచ్చారు. ఈపీడీసీఎల్‌లో రిక్రూట్‌మెంట్ ద్వారా నియామకాలు జరుగుతున్నాయి. వీరితో సమానంగా సొసైటీ ఉద్యోగులకు జీతాలు ఇవ్వడానికి నిబంధనలు ఒప్పుకోవు. అందుకని పాత పాలకవర్గం అప్పట్లో చేసిన తీర్మానం ప్రకారం 2022 పీఆర్‌సీ అమలు చేస్తున్నామని నోట్ తయారుచేసి, దాని ప్రకారం అందరికీ జీతాలు పెంచేశారు. ఇది కూడా తప్పే. ప్రస్తుతం సొసైటీకి స్వయంగా జిల్లా కలెక్టరే పర్సన్ ఇన్‌చార్జిగా ఉన్నారు. ఆమె అందుకు ఎలా అంగీకరించారనేది అర్థం కావడం లేదు. ఆ జిల్లా ఎస్ఈ సొసైటీ ఇన్‌చార్జి ఎండీగా వ్యవహరిస్తున్నారు. వారిపై రాజకీయ ఒత్తిళ్లు పెట్టి పీఆర్‌సీ అమలు చేసినట్టు విశ్వసనీయంగా తెలిసింది.

తేలుకుట్టిన దొంగల్లా...

పీఆర్‌సీ అమలుపై ఈపీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో వివరణ కోరితే, సొసైటీ నుంచి ప్రతిపాదనలు వచ్చాయని, బిల్లులు పెడితే ఎప్పటిలాగే ఇచ్చామని, తమ తప్పు ఏమీ లేదని, ప్రత్యేక ఉత్తర్వులు ఏవీ లేవని 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. అనకాపల్లి జిల్లా అధికారిని వివరణ కోరితే, కార్పొరేట్ కార్యాలయమే జీతాలు విడుదల చేసిందని, తమ ప్రమేయం ఏమీ లేదని, పాత పాలకవర్గం తీర్మానం ఆధారంగా చేసుకొని పీఆర్‌సీ ఇచ్చామని తెలిపారు. జిల్లా స్థాయి సహకార శాఖ అధికారిని దీనిపై ప్రశ్నిస్తే...ఆర్ఈసీఎస్‌కు పీఆర్‌సీ వర్తించదని చాలా స్పష్టంగా చెప్పారు.

పదవీ విరమణ వయస్సు పెంపునకు నిరాకరణ

ఇటీవల అనకాపల్లి నేత ఒకరు ఆర్ఈసీఎస్ ఉద్యోగుల పట్ల ప్రత్యేక ప్రేమ చూపిస్తూ వారికి పదవీ విరమణ వయస్సు 58 నుంచి 62 ఏళ్లకు పెంచాలని సహకార సంస్థకు రాశారు. దీనిపై కమిషనర్ చట్టాలన్నీ పరిశీలించి, అలా కుదరదని, ప్రభుత్వ ఉద్యోగుల్లా 62 ఏళ్లు చేయలేమని గత నెలలో ఫైల్ వెనక్కి తిప్పి పంపించారు. ఇదే సొసైటీలో అక్రమాలపై విచారణ చేయాలని ఎమ్మెల్యే అసెంబ్లీలో కోరితే ప్రభుత్వం 51ఏ విచారణకు ఆదేశించింది. ఒక వైపు విచారణ జరుగుతూ, మరో వైపు ఆపరేషన్లన్నీ ఈపీడీసీఎల్‌కు అప్పగించిన నేపథ్యంలో అక్కడి ఉద్యోగులకు పీఆర్‌సీ ఎలా ఇస్తారనేది అర్థం కాని వ్యవహారం. ఈ విషయంలో లోపాయికారీ ఒప్పందాలు భారీగా జరిగాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ఫిర్యాదు కూడా చేశారు.

ఎన్నికల హామీలను అమలు చేయని ప్రభుత్వం

▸▸ సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి... ▸▸ ఎలమంచిలిలో జిల్లా మహాసభ



ఎలమంచిలి పట్టణంలో ర్యాలీ చేస్తున్న సీపీఐ నేతలు



జిల్లా మహాసభలో మాట్లాడుతున్న జేవీ సత్యనారాయణమూర్తి

ఎలమంచిలి, మే 5 (ఆంధ్రజ్యోతి):ఎన్నికల్లో ఎన్డీయే ఇచ్చిన హామీలను పూర్తి స్థాయిలో అమలు చేయలేదని భారత కమ్యూనిస్టు పార్టీ(సీపీఐ)రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ. సత్యనారాయణమూర్తి ఆరోపించారు. సోమవారం పట్టణంలో సీపీఐ 2వ జిల్లా మహాసభను నిర్వహించారు. తొలుత ఆర్టీసీ బస్టాండ్ జంక్షన్ నుంచి రైల్వే స్టేషన్ రోడ్డు మీదుగా ర్యాలీ గురవప్ప కల్యాణ మండపం వరకూ సాగింది. అనంతరం గురవప్ప కల్యాణ మండపం వద్ద ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సత్యనారాయణ మూర్తి మాట్లాడుతూ తాము అధికారంలోకి వస్తే ఏడాదికి 2 కోట్ల మంది నిరుద్యోగులకు ఉద్యోగాలిస్తామని హామీ ఇచ్చారని నెరవేర్చాలన్నారు. ఎన్నడూ లేని విధంగా నిరుద్యోగం పెరిగిపోయిందన్నారు. భారతీయ సమాజం ఐకమత్యంలో భిన్నత్వంలా ఉంటుందని, అసమానతలను తగ్గించేందుకు కులగణన ఉపయోగపడుతుందన్నారు. స్థానికంగా నెలకొల్పే పరిశ్రమల్లో స్థానికులకు 70 శాతం మందికి ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. పేదవాడికి సొంతింట కళ నెరవేర్చేందుకు అండగా సీపీఐ అండగా నిలుస్తుందన్నారు.

అనంతరం సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గుజ్జల ఈశ్వరయ్య, జిల్లా కార్యదర్శి బీవీ. రమణలు ఈ మహాసభలు విధి విధానాలను వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మానం ఆంజనేయులు, సీపీఐ నేతలు ఎం.రాయునాయుడు, ఆర్.దొరబాబు, కార్యవర్గ సభ్యులు కె.సన్యాసిరావు, ఆర్.జగ్గారావు, సీహెచ్. క్రాంతి, బి. సుబ్బలక్ష్మి పాల్గొన్నారు.

ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలి : ఏడీఎంహెచ్‌వో

పాయకరావుపేట, మే 5 (ఆంధ్రజ్యోతి) : వాతావరణంలో వస్తున్న మార్పులతో ప్రజల ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని అడిషనల్ డీఎంహెచ్ఓ డాక్టర్ బాలాజీ పీహెచ్‌సీ సిబ్బందిని ఆదేశించారు. సోమవారం పాయకరావుపేట పీహెచ్‌సీని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో రికార్డులు పరిశీలించారు. అదేవిధంగా పీహెచ్‌సీ పరిధిలో జరుగుతున్న ఎన్‌సీడీ, ఈసీ సర్వేతోపాటు టీబీ, హెచ్ఐవీపై సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సిబ్బంది ప్రస్తుత ఎండా కాలంలో ప్రజలు వడదెబ్బకు గురవకుండా అవగాహన కల్పించడంతోపాటు అపుడప్పుడు పడుతున్న వర్షాలకు ప్రజలకు ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా ఉండేలా అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ డి.సుభాష్, ఈఓ పీవీ.రమణ, హెచ్ఎస్ ఎం.నాగేశ్వరరావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



పాయకరావుపేట పీహెచ్‌సీలో తనిఖీ చేస్తున్న అడిషనల్ డీఎంహెచ్ఓ బాలాజీ

ఏటికొప్పాక హస్త కళాకారుల జీవనశైలిని పరిశీలించిన కో-ఆర్డినేటర్



హస్తకళకారులతో మాట్లాడుతున్న వినోద్

ఎలమంచిలి, మే 5 (ఆంధ్రజ్యోతి): ఏటికొప్పాకలో హస్తకళాకారుల కాలనీని సోమవారం పంచాయతీరాజ్ రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ రాష్ట్ర కో-ఆర్డినేటర్ వినోద్ స్థాక అధికారులతో కలిసి సందర్శించారు. ఎంపీడీఓ కేఎస్. కొండలరావు, ప్రసాద్‌లతో కలిసి ఆయన హస్తకళాకారుల జీవనశైలిని స్వయంగా పరిశీలించారు. రాష్ట్రపతి అవార్డు గ్రహీత సీవీఎస్‌రాజు, చిన్నయాచారిలను కలిసి కళాకారుల గురించి అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ కింద ఏటిగ్రామం ఎంపికైనట్టు తెలిపారు. ప్రధానంగా కళాకారులను ఆర్థికంగా మరింత బలోపేతం చేసేందుకు కావాల్సిన అంశాలు గురించి చర్చించడం జరిగిందన్నారు. ఇందులో భాగంగా ప్రభుత్వం 5 కోట్ల రూపాయలు మంజూరు చేస్తుందని, ఇందు కోసం కళాకారులు నూతన ఒరవడిని అందిపుచ్చుకునేలా శిక్షణ ఇస్తున్నారు.

మినీ బస్సును ఢీకొన్న ఆటో

▸▸ ముగ్గురికి తీవ్రగాయాలు

కోటవురట్ల, మే 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాతరోడ్డు సమీపంలో అతివేగంగా వెళుతున్న ఆటో, ఎదురుగా వస్తున్న మినీ బస్సును ఢీకొన్నది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న పది మంది గాయపడ్డారు. వీరిలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యా యి. ఈ సంఘటనకు సంబంధించి ఎస్ఐ రమేశ్ అందజేసిన వివరాలిలా ఉన్నాయి. ఎస్.రాయవరం మండలం అడ్డరోడ్డు నుంచి 14 మంది ప్రయాణికులతో బయలుదేరిన ఆటో కోటవురట్ల వస్తున్నది. దీనికి ముందు ఒక కారు వెళుతున్నది. పాతరోడ్డు జంక్షన్ సమీపంలో ఎదురుగా మినీ బస్సు వస్తుండడంతో కారు డ్రైవర్ వేగాన్ని తగ్గించాడు. ఇదే సమయంలో ఆటో డ్రైవర్ వేగం పెంచి, కారును ఓవర్‌టేక్ చేస్తూ మినీ బస్సును ఢీకొన్నాడు. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న దాడి లక్ష్మి (అచ్యుతాపురం), ఎన్.నూకరత్నం (కైలాసపట్నం), నాగపద్మ(పాయకరావుపేట) తీవ్రంగా గాయపడ్డారు. లక్ష్మిని విశాఖపట్నం కేజీహెచ్‌కు, నూకరత్నంను నర్సీపట్నం ఆస్పత్రికి, నాగపద్మను తుని ఏరియా ఆస్పత్రికి తరలించారు. స్వల్పంగా గాయపడిన నాగతేజ్, బి.వెంకటలక్ష్మి, అమ్ములు, పి.రాజులమ్మ, ఆర్.శాంతి, డి.సోమన్న, ఆటో డ్రైవర్ శ్రీనివాసరావులను కోటవురట్ల సీహెచ్‌సీకి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ రమేశ్ తెలిపారు



ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న వృద్ధురాలు



నుజ్జు నుజ్జు అయిన ఆటో

తిమ్మాపురంలో డ్రైనేజీ నిర్మాణం



డ్రైనేజీ పనులను పరిశీలిస్తున్న సర్పంచ్ సత్యనారాయణ

ఎస్.రాయవరం, మే 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మేజరు పంచాయతీ తిమ్మాపురంలో ఆంజనేయస్వామి ఆలయం వద్ద నుంచి సమీపంలో థియేటర్ వరకు రూ. ఐదు లక్షలతో నూతన డ్రైనేజీ నిర్మిస్తున్నారు. ఈ పనులను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ కర్రి సత్యనారాయణ మాట్లాడుతూ రూ. ఐదు లక్షలతో డ్రైనేజీ నిర్మిస్తున్నామన్నారు.

మునిసిపల్ కమిషనర్‌కు కార్మికుల సమ్మె నోటీసు



సమ్మె నోటీసును అందజేస్తున్న కార్మిక నేతలు

ఎలమంచిలి, మే 5 (ఆంధ్రజ్యోతి): ఈనెల 20వ తేదీన సార్వత్రిక సమ్మెలో భాగంగా సోమవారం మునిసిపల్ కమిషనర్ ప్రసాదరాజుకు వినతిపత్రం అందజేసినట్టు కార్మిక నేత గనిశెట్టి ఏసుదాసు తెలిపారు. ఏఐటీయూసీ రాష్ట్ర సమితి సభ్యులు గనిశెట్టి ఏసుదాసు, మునిసిపల్ కార్మిక నేతలతో కలిసి ఆయన కమిషనర్‌ను కలిశారు. ఈ కార్యక్రమంలో కార్మిక నేతలు వై.నూకరాజు, సీహెచ్. వెంకటరమణ, సూరిబాబు, బాబూరావు పాల్గొన్నారు.

కిక్ బాక్సింగ్‌లో ఎలమంచిలి క్రీడాకారులకు బంగారు పతకాలు



రాష్ట్ర కిక్ బాక్సింగ్ పోటీల్లో పతకాలు సాధించిన ఎలమంచిలి క్రీడాకారులు

ఎలమంచిలి, మే 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి కిక్ బాక్సింగ్ పోటీల్లో స్థానిక పీఎస్ఆర్ మార్షల్ అసోసియేషన్ క్రీడాకారులు పలు విభాగాల్లో బంగారు, సిల్వర్, బ్రాంజ్ పతకాలను కైవసం చేసుకున్నట్టు ఫౌండర్ కోచ్ నక్కా వెంకట్రామన్ తెలిపారు. ఆంధ్రా యూనివర్సిటీ కిక్ బాక్సింగ్ స్టేడియంలో ఆదివారం నిర్వహించిన ఈ టోర్నీలో ఎలమంచిలి పీఎస్ఆర్ మార్షల్ అసోసియేషన్ క్రీడాకారులు 4 బంగారు, 8 సిల్వర్, 7 బ్రాంజ్ పతకాలను కైవసం చేసుకున్నట్టు ఆయన తెలిపారు. 69 కిలోల కేటగిరిలో కశింకోట శ్రీను, కె.హాసిని, ఎస్‌కే.ఆఫ్రిన్, ఈ. రాకేష్ బంగారు పతకాలను కైవసం చేసుకున్నారన్నారు. విజేతలకు బహుమతులతోపాటు ధ్రువీకరణ పత్రాలు అందించారన్నారు.

ఇళ్లలోకి మురుగు నీరు వస్తుందంటూ ఫిర్యాదు

ఎస్.రాయవరం, మే 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మవరం అగ్రహారంలో గల వివేకానంద కాలనీలో ఉన్న డ్రైనేజీ నిండి తమ ఇళ్లల్లోకి మురుగు నీరు వస్తుందని కాలనీకి చెందిన పలువురు మహిళలు సోమవారం స్థానిక సచివాలయంలో ఫిర్యాదు చేశారు. దీంతో పంచాయతీ కార్యదర్శి, సచివాలయ సిబ్బంది, తెలుగుయువత మండల అధ్యక్షుడు సుంకర శ్రీనివాసరావు, గ్రామ శాఖ అధ్యక్షుడు బండి నాగేశ్వరరావుతో కలిసి డ్రైనేజీలను పరిశీలించారు. డ్రైనేజీ మార్గంలో నీరు నిలిచిపోవడాన్ని గమనించిన వారు సమస్యను పరిష్కరిస్తామని అధికారులు హామీ ఇచ్చారు.

తహసీల్దార్ కార్యాలయం వద్ద ఏపీటీఎఫ్ ధర్నా



నక్కపల్లిలో ధర్నా చేస్తున్న ఏపీటీఎఫ్ ప్రతినిధులు

నక్కపల్లి, మే 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం ఏపీటీఎఫ్ సంఘ ప్రతినిధులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఏపీటీఎఫ్ రాష్ట్ర పూర్వ కార్యదర్శి బీ వెంకట్రాజు మాట్లాడుతూ ప్రభుత్వ విద్యా వ్యతిరేక విధానాలను అనుసరిస్తోందన్నారు. నక్కపల్లి మండల శాఖ అధ్యక్షుడు వై.కృష్ణ, జిల్లా అధ్యక్షుడు ధర్మారావు, రాష్ట్ర కౌన్సిలర్ డీ కొండలరావు, పి.గణేశ్, కె.శ్రీనివాసరావు తదితరులు ఉపాధ్యాయ సమస్యలను వివరించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో అందుబాటులో వున్న అధికారులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పలువురు సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

'ఆదరణ డీడీల నగదు ఇప్పించాలి'

ఎస్.రాయవరం, మే 5 (ఆంధ్రజ్యోతి): 2014-19 టీడీపీ ప్రభుత్వం హయాంలో ఆదరణ పథకం కోసం చెల్లించిన డీడీ నగదును తిరిగి ఇప్పించాలంటూ సోమవారం రేవుపోలవరం మత్స్యకారుడు కోడ లోవరాజు, మత్స్యకారులతో కలిసి ఇన్‌చార్జి ఎంపీడీవో సత్యనారాయణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా లోవరాజు మాట్లాడుతూ ఆదరణ పథకం కోసం రేవుపోలవరం, కొత్తరేవుపోలవరం గ్రామాలకు చెందిన 60 మంది మత్స్యకారులు దరఖాస్తు చేసుకున్నారన్నారు. వారంతా పది శాతం మేరకు డీడీలు తీసి ఇవ్వడం జరిగిందన్నారు. అయితే వైసీపీ ప్రభుత్వం పరికరాలు ఇవ్వలేదని, తాము చెల్లించిన డీడీల నగదును తిరిగి ఇవ్వలేదంటూ ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించిన డీడీ నగదును ఇప్పిచాలని లోవరాజు కోరారు. ఈ కార్యక్రమంలో కొవిరి బంగారి, చేపల రుద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు

పాయకరావుపేట, మే 5 (ఆంధ్రజ్యోతి) : స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా సోమవారం విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థుల్లో జూనియర్స్ జాతీయ జెండా, సీనియర్స్ భారతదేశం మాప్‌లో రాష్ట్రాలు, నదులు, సరిహద్దులు గుర్తించి రంగులు వేయడంపై పోటీలు నిర్వహించారు. అదేవిధంగా రిసోర్స్‌పర్సన్ ఎస్.సీతారామమూర్తి విద్యార్థులకు పుస్తక పఠనం, తెలుగు, ఇంగ్లీషు పదాలు చదవడం, రాయడం నేర్పించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి లైబ్రేరియన్ వామాల లక్ష్మణరావు పాల్గొన్నారు.

డంపర్ ఢీకొని ఒకరికి తీవ్ర గాయాలు

అచ్యుతాపురం, మే 5 (ఆంధ్రజ్యోతి): అచ్యుతాపురం-గాజువాక రోడ్డులో రామన్నపాలెం వద్ద సోమవారం డంపర్ ఢీకొని ఒక వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. రామన్నపాలెంకి చెందిన ధర్రిరెడ్డి శ్రీనివాసరావు ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నాడు. అచ్యుతాపురం నుంచి స్వగ్రామం బైక్‌పై వెళ్తుండగా రామన్నపాలెం రామాలయం వద్ద వెనుక నుంచి వస్తున్న డంపర్ ఢీకొంది. దీంతో శ్రీనివాసరావు తలకు తీవ్ర గాయమై ముక్కు, చెవుల నుంచి తీవ్ర రక్తస్రావం అయ్యింది. డంపర్ డ్రైవర్ ఆపకుండా వెళ్లిపోతుండగా వెనుక నుంచి వస్తున్న కారు యజమాని కేకలు వేయడంతో స్థానికులు అడ్డుకున్నారు. అనంతరం డ్రైవర్‌ని పోలీసులకు అప్పగించారు. తీవ్రంగా గాయపడిన శ్రీనివాసరావును విశాఖలో ప్రైవేటు ఆసుపత్రికితరలించారు.

వర్ధమాన్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

▸▸ సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రాము డిమాండ్



కర్మాగారం ప్రతినిధులతో చర్చిస్తున్న రాము

అచ్యుతాపురం, మే 5 (ఆంధ్రజ్యోతి): వర్ధమాన్ కర్మాగారంలో కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రొంగలి రాము డిమాండ్ చేశారు. సోమవారం కర్మాగారం వద్ద కార్మికులు ఆందోళన చేశారు. ఈసందర్భంగా రాము మాట్లాడుతూ పరిశ్రమలో కార్మికులకు పుష్కర కాలంగా జీతాలు పెంచకుండా వెట్టి చాకిరీ చేయిస్తున్నారన్నారు. అంతేకాక కర్మాగారం ప్రతినిధులు కార్మికులను వేధింపులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. ఓటీ చేసిన కార్మికులకు భోజనం, రవాణా సదుపాయం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని.. లేకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. కాగా కర్మాగారం ప్రతినిధి వేంకటేశ్వరరావు ఆందోళన చేస్తున్న వారితో చర్చలు జరిపారు. యాజమాన్యానికి చెప్పి సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని హామీ ఇచ్చారు.

పింఛన్ కోసం ఎంపీడీవోకు వితంతువుల వినతి

మునగపాక, మే 5 (ఆంధ్రజ్యోతి): ప్రతి నెల అందజేసే ఎన్టీఆర్ భరోసా పింఛన్ మంజూరు చేయాలని గణపర్తి గ్రామ వితంతువులు ఎంపీడీవో ఎం.ఉషారాణిని కోరారు. ఎంపీడీవోకు వితంతువులు మారిశెట్టి జయలక్ష్మి, భీముని సత్యవతి, పేటూరి చిట్టమ్మ, ఎ.రాజేశ్వరి, చదరం శివలక్ష్మి, సీహెచ్.కుమారి, ఆడారి లక్ష్మి, యల్లపు సత్యవతి, పెంటకోట ధనలక్ష్మి తదితరులు వినతి పత్రాన్ని అందజేశారు. అర్హులకు వితంతు పింఛన్ మంజూరు చేయాలని సర్పంచ్ చదరం గణేష్ నాయుడు కోరారు.

రైతు సేవా కేంద్రాల్లో అన్నదాత సుఖీభవ నమోదు

మునగపాక, మే 5 (ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవ పథకం అమల్లోకి రానున్న నేపథ్యంలో ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ రైతు సేవా కేంద్రాల్లో జరుగుతున్నదని మండల వ్యవసాయాధికారిణి జ్యోత్స్నకుమారి ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు ఆధార్ కార్డు, 1బి పట్టుకొని సేవా కేంద్రాలకు వెళ్లాలని తెలిపారు. వాటి జెరాక్స్‌లను కూడా వెంట తీసుకు వెళ్లాలని చెప్పారు.

సుఖీభవతో రైతులకు పెట్టుబడి సాయం : ఏవో



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో ఉమా ప్రసాద్

నక్కపల్లి, మే 5 (ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవ పథకం ద్వారా ప్రతీ రైతుకు పెట్టుబడి సాయం అందుతుందని ఏవో ఉమాప్రసాద్ అన్నారు. సోమవారం మండలంలోని ఉద్దండపురంలో అన్నదాత సుఖీభవ పథకంపై రైతులకు అవగాహన కల్పించారు. రైతులు ఎదుర్కొంటున్న ఆర్థిక సవాళ్లను తగ్గించి, వ్యవసాయ ఉత్పాదకతను పెంచడమే ఈ పథకం లక్ష్యమన్నారు. అర్హులైన రైతులకు ఒక్కొక్కరికీ ఏడాదికి రూ. 20వేలు చొప్పున మూడు విడతల్లో లభిస్తుందన్నారు. ఇందులో రాష్ట్ర ప్రభుత్వం రూ. 14వేలు, కేంద్రం రూ. 6వేలు అందజేస్తుందన్నారు. కౌలురైతులకు కూడా ఇది వర్తిస్తుందని చెప్పారు. వెబ్‌లాండ్‌లో వున్న రైతులంతా అన్నదాత సుఖీభవ పోర్టల్ ద్వారా నమోదుకావాలన్నారు. ఈ సమావేశంలో ఏఈవో సత్యనారాయణ, సురేంద్ర, రైతులు పాల్గొన్నారు.

పిల్లలకు యోగా శిక్షణ

నక్కపల్లి, మే 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చినదొడ్డిగల్లు శాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా సోమవారం నుంచి ఉచిత యోగా శిక్షణ తరగతులను ప్రారంభించారు. పిల్లలు ఆరోగ్యంగా, ఏకాగ్రతగా వుండేందుకు యోగా ఉపయోగపడుతుందని గ్రంథాలయాధికారి జనార్దన్ చెప్పారు. పలు ఆసనాలు, ధ్యానంపై యోగా ట్రైనర్ రమణమ్మ పిల్లలకు శిక్షణ ఇచ్చారు. పలువురు విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు.

పూడిమడక ఉప్పుటేరులో చనిపోతున్న చేపలు

అచ్యుతాపురం, మే 5 (ఆంధ్రజ్యోతి): పూడిమడక ఉప్పుటేరులో సోమవారం వందల సంఖ్యలో చిన్న చేపలు చనిపోయి నీటిలో తేలిపోయాయి. దీంతో మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు. సెజ్‌లో కర్మాగారాల నుంచి వ్యర్థాలు ఉప్పుటేరులో కలవటం వల్ల చనిపోతున్నాయని మత్స్యకార నాయకుడు చేపల తాతలు ఆరోపించారు. అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు

డీఎస్‌సీ అభ్యర్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ



డీఎస్సీ స్టడీ మెటీరియల్ అందజేస్తున్న వెంకట అప్పారావు

అచ్యుతాపురం/రూరల్, ఏప్రిల్ 5, (ఆంధ్రజ్యోతి): డీఎస్సీకి సిద్ధమవుతున్న అభ్యర్థులకు విద్యా మనోవిజ్ఞాన శాస్త్రం స్టడీ మెటీరియల్‌ని ఉచితంగా అందజేస్తున్నామని జనవిజ్ఞాన వేదిన అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి మారిశెట్టి వెంకట అప్పారావు తెలిపారు. సోమవారం మండలంలోని కొండకర్ల, తిమ్మరాజుపేట, హరిపాలెం, అచ్యుతాపురంల్లో డీఎస్‌సీ పోటీ పరీక్ష కోసం సిద్ధమవుతున్న అభ్యర్థులకు ఆయన ఉచితంగా స్టడీ మెటీరియల్‌ను అందజేశారు. బాగా చదివి ఉపాధ్యాయుడిగా ఉద్యోగం సాధించాలన్నారు. మెటీరియల్ కావాల్సిన అభ్యర్థులు నేరుగా 9494187980ను సంప్రదించాలని కోరారు.

ఎస్సీ సబ్సిడీ రుణాలకు దరఖాస్తులు ఆహ్వానం

పాయకరావుపేట, మే 5 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాల మంజూరు కోసం అర్హులైన అభ్యర్థులు ఈనెల 10వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ ఎ.జయప్రకాశరావు తెలిపారు. మండలానికి స్వయం సహాయక, ట్రాన్స్‌పోర్టు, అగ్రికల్చరల్ రంగాలకు సంబంధించి 42 యూనిట్లు మంజూరయ్యాయన్నారు. ఒక్కో యూనిట్‌కి రూ. లక్ష నుంచి రూ.4 లక్షల వరకు రుణం మంజూరు చేస్తామని, సబ్సిడీ రుణాల కోసం 21 నుంచి 50 సంవత్సరాలలోపు అర్హులైన ఎస్సీ అభ్యర్థులు ఈనెల 10వ తేదీలోగా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో 44 మందికి జరిమానా

ఎలమంచిలి, మే 5 (ఆంధ్రజ్యోతి): ఎలమంచిలి పట్టణ పోలీస్ స్టేషన్, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌ల పరిధిలో గత పది రోజుల నుంచి డ్రంకెన్ డ్రైవ్ కేసులలో పట్టుబడిన 44 మందిని సోమవారం ఎలమంచిలి కోర్టుకు తరలించారు. వీరిలో 37 మందికి ఒక్కొక్కరికి రూ. 10 వేలు చొప్పున జరిమానా విధించారని, ఏడుగురికి నాలుగు రోజులు పాటు రిమాండ్ విధించారని ఎస్ఐ సావిత్రి, రామకృష్ణ తెలిపారు.

సమస్యలకు సత్వర పరిష్కారం : ఆర్డీవో


ఆర్డీవో వీవీరమణకు వినతిపత్రం ఇస్తున్న కాంతమ్మ

నర్సీపట్నం, మే 5 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలను సత్వరమే పరిష్కరించాలని ఆర్డీవో వీవీ రమణ అధికారులను ఆదేశించారు. సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఆర్డీవో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 21 అర్జీలు వచ్చాయి. కొరుప్రోలుకు చెందిన కొంగర కాంతమ్మ తన పెద్ద కొడుకు వెంకట్రావు తనకు మాయ మాటలు చెప్పి 30 ఎకరాలు భూమిని అతని కొడుకు వీర వెంకట విజయ్ సమీర్ పేరు మీద గిఫ్టడీడ్ రాయించుకున్నాడని, ఇప్పుడు తనను పట్టించుకోవడం మానేశాడని ఫిర్యాదు చేసింది. అలాగే నర్సీపట్నం డిగ్రీ కళాశాల దగ్గర ఉన్న పెద్ద మదుం దిగువున సర్వే నంబరు 35 నుంచి 38 వరకు ఉన్న 30 ఎకరాల భూములను సాగు చేసుకుంటున్న రైతులకు వెళ్లడానికి దారి లేకుండా చేస్తున్నారని సీహెచ్ అప్పలనాయుడు, ఎంవీవీ సత్యనారాయణ తదితరులు ఆర్డీవోకి ఫిర్యాదు చేశారు. అయ్యన్నకాలనీలో ఇళ్ల మీద నుంచి విద్యుత్ వైర్లు చేతికందే ఎత్తులో ఉండటంతో ఇబ్బంది పడుతున్నామని, ఎప్పుడు ప్రమాదం ముంచుకు వస్తుందోనని భయభ్రాంతులు చెందుతున్నామని ఎ.లక్ష్మి, సీత ఫిర్యాదు చేశారు.

అనుమానాస్పద కేసును తప్పుదోవ పట్టిస్తున్నారు

▸▸ మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేశ్


జిల్లా ఎస్పీ ఆఫీసు వద్ద మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గణేశ్

నర్సీపట్నం, మే 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేములపూడికి చెందిన బండారు అప్పన్న(35) అనుమానాస్పద మృతి కేసుని రూరల్ సీఐ రోడ్డు ప్రమాదంగా చూపించే ప్రయత్నం చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర గణేశ్ ఆరోపించారు. ఈ మేరకు అనకాపల్లిలో ఎస్పీకి ఫిర్యాదు చేశారు. జనవరి 11న అప్పన్న తీవ్రగాయాలతో రోడ్డు మీద పడి ఉండటం చూసి కుటుంబ సభ్యులు 108 అంబులెన్స్‌కి ఫోన్ చేశారన్నారు. అంబులెన్స్ సిబ్బంది వచ్చి చూసి అప్పన్న చనిపోయినట్టు నిర్ధారించారని తెలిపారు. తర్వాత రోజు మృతుడి తండ్రి రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారన్నారు. పోస్టుమార్టం నివేదికలో తల వెనక, చెవి, మెడ మీద తీవ్ర గాయాలు ఉన్నట్టు ఇచ్చారని తెలిపారు. కొంత మంది వ్యక్తులు అప్పన్నపై దాడి చేశారని బలమైన ఆధారాలు ఉన్నప్పటికి రోడ్డు ప్రమాదంగా చూపించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు.

హైస్కూల్‌కు ఆనుకొని ప్రైవేటు పాఠశాల

▸▸ అనుమతులు 5వ తరగతి వరకే.. కానీ 7వ తరగతి వరకు నిర్వహణ

▸▸ చోద్యం చూస్తున్న మండల విద్యాశాఖ అధికారులు

▸▸ హైస్కూల్‌లో ఏటా తగ్గుతున్న విద్యార్థుల సంఖ్య

▸▸ అధికారుల తీరుపై మండిపడుతున్న మాకవరపాలెం ప్రజలు


మాకవరపాలెం హైస్కూల్‌కి ఆనుకొని ఉన్న ప్రైవేటు పాఠశాల

మాకవరపాలెం, మే 5 (ఆంధ్రజ్యోతి): నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వ హైస్కూల్‌కు ఆనుకొని ప్రైవేటు పాఠశాల నిర్వహిస్తున్నా మండల విద్యాశాఖ అధికారులు నిద్రపోతున్నారు. దీనిపై విద్యార్థుల తల్లిదండ్రులు మండిపడుతున్నారు. విచిత్రమేమిటంటే.. ఎక్కడో మారుమూల ప్రాంతంలో ఇలా నిర్వహించడం లేదు.. మండల కేంద్రం మాకవరపాలెంలో మూడేళ్ల నుంచి దర్జాగా ప్రభుత్వ హైస్కూల్‌కు ఆనుకొని నిర్వహించడం విశేషం. ఫలితంగా హైస్కూల్‌లో విద్యార్థుల సంఖ్య ప్రతీ ఏడాది తగ్గుతూ వస్తోంది. అయినా మండల విద్యా శాఖ అధికారుల్లో చలనం లేదు.

మాకవరపాలెం హైస్కూల్‌కి ఆనుకొని ఒక ప్రైవేటు పాఠశాలను రిటైర్డ్ ఉపాధ్యాయుడు నిర్వహిస్తున్నారు. నిబంధనల ప్రకారం ప్రభుత్వ పాఠశాలకు 500 మీటర్ల దూరంలో ప్రైవేటు పాఠశాల ఉండాలి. కాని ఈ ఉపాధ్యాయుడు ఇటు రాజకీయ బలం, అటు ప్రభుత్వ విద్యాశాఖ అధికారుల అండదండలు పుష్కలంగా ఉండడంతో నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్నారని స్థానికులు అంటున్నారు. మూడేళ్లగా ఇలా నిర్వహిస్తున్నా విద్యా శాఖ అధికారులు అటు వైపు కన్నెత్తి చూడడం లేదు. హైస్కూల్ గోడకు ఆనుకొని ఈ పాఠశాల 7వ తరగతి వరకు నిర్వహిస్తున్నారు. అయితే అనుమతులు మాత్రం 5వ తరగతి వరకు ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. దీంతో హైస్కూల్‌లో ప్రతి ఏటా విద్యార్థుల సంఖ్య తగ్గుతోంది. ఇదే హైస్కూల్‌లో ఒకప్పుడు 500 నుంచి 800మంది విద్యార్థులు ఉండేవారు. ప్రస్తుతం 470మందికి విద్యార్థుల సంఖ్య పడిపోయింది. అయినా మండల విద్యా శాఖ అధికారులు చర్యలు తీసుకోకపోవడంపై స్థానికులు మండిపడుతున్నారు. హైస్కూల్‌లో ప్రతి ఏటా విద్యార్థుల సంఖ్య తగ్గడలకు పక్కనే ఉన్న ప్రైవేటు పాఠశాలే కారణమని హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు అచ్యుత్‌రామయ్య 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. ఇప్పటికైనా విద్యా శాఖ అధికారులు స్పందించి ఈ ప్రైవేటు పాఠశాల పై చర్యలు తీసుకోవాలని మండల కేంద్రం ప్రజలు కోరుతున్నారు. దీనిపై ఎంఈవో-1 జాన్ ప్రసాద్ వద్ద ప్రస్తావించగా.. ప్రైవేటు పాఠశాలకు 5వ తరగతి వరకు అనుమతులు ఉన్నాయన్నారు. కాని 7వ తరగతి వరకు పాఠశాల నడుతుపున్నట్టు తెలిసిందన్నారు. అలాగే అక్కడ పాఠశాల ఉండకూడదన్నారు. ఈ ఏడాది పాఠశాలను తనిఖీ చేసి చర్యలు తీసుకుంటామన్నారు.

భమిడికిలొద్దిలో లేట్‌రైట్ తవ్వకాలు నిలిపివేయాలి

▸▸ సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు కె.లోకనాథం


లేట్‌రైట్ తవ్వకాలను పరిశీలిస్తున్న కె. లోక్‌నాథం, తదితరులు

నాతవరం, మే 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సరుగుడు పంచాయతీ భమిడికిలొద్ది దగ్గర నాగులకొండపై జరుగుతున్న లేట్‌రైట్ తవ్వకాలను వెంటనే నిలిపివేయాలని సీపీఎం కేంద్రకమిటీ సభ్యులు కె. లోక్‌నాథం డిమాండ్ చేశారు. సోమవారం సీపీఎం సభ్యులతో కలిసి ఆయన నాగులకొండపై జరుగుతున్న లేట్‌రైట్ తవ్వకాలను పరిశీలించారు. ఈ సందర్భంగా లోక్‌నాథం మాట్లాడుతూ పెసా, 1/70 యాక్టు ఉల్లఘించి చేస్తున్న లేట్‌రైట్ తవ్వకాల లీజులను రద్దు చేయాలన్నారు. గ్రామసభ ఆమోదం లేకుండా 121 హెక్టార్లలో లేట్‌రైట్ తవ్వకాలు జరుగుతున్నాయని, వాటి అనుమతులు రద్దు చేయాలన్నారు. లేట్‌రైట్ తవ్వకాలతో జీడి, మామిడి, ఇతర పంటలు దెబ్బతినడంతో గిరిజనులకు అన్యాయం జరుగుతుందన్నారు. లేట్‌రైట్ తవ్వకాలు ఆపకపోతే పోరాటాలతో అడ్డుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లాకమిటీ సభ్యులు రాజు, త్రిమూర్తులు, రాజవోమ్మంగి సీపీఎం మండల కార్యదర్శి సూరిబాబు, ప్రజానాట్యమండలి నాయకులు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అల్లూరి పార్కులో వికసించిన మే ఫ్లవర్స్



కృష్ణాదేవిపేట, మే 5 (ఆంధ్రజ్యోతి): గొలుగొండ మండలం కృష్ణాదేవిపేట అల్లూరి సీతారామరాజు పార్కులో మే ఫ్లవర్స్ పర్యాటకులను కనువిందు చేస్తున్నాయి. ప్రతి ఏటా మే నెలలో పూసే ఈ ఫ్లవర్స్ ఈ పార్కులో ఉండడంతో పర్యాటకులను ఆకర్షిస్తున్నాయి.

నేడు జైతవరంలో ఆంజనేయ తీర్థం



చీడికాడ, మే 5 (ఆంధ్రజ్యోతి) : జైతవరంలో అభయాంజ నేయస్వామి తీర్థం మంగళవారం జరగనుంది. ఇందుకు సంబంధించి భారీ ఏర్పాట్లు చేసినట్టు సర్పంచ్ కోడూరు సత్యవతి, ఎంపీటీసీ పైల ముత్యాలనాయుడు తెలిపారు. వేకువజాము నుంచి స్వామికి విశేష పూజలు ప్రారంభం కానున్నాయన్నారు. ఉదయం తొమ్మిది గంటలకు ఆలయం వద్ద ముగ్గుల పోటీలు, మధ్యాహ్నం మూడు గంటలకు జిల్లాస్థాయి ఎడ్లపరుగు పోటీలు, సాయంత్రం ఐదు గంటలకు మహిళలకు కోలాట పోటీలు ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు.

'10లోపు టీడీపీ గ్రామ కమిటీలు ఏర్పాటు'


టీడీపీ మన్యపురట్ల అధ్యక్షుడు బాబ్జీకి నియామక పత్రం అందజేస్తున్న నేతలు

నాతవరం, మే 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అన్ని పంచాయితీలలో మే పదో తేదీలోపు టీడీపీ గ్రామ కమిటీలు ఏర్పాటు చేయనున్నట్టు తాండవ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ కరక సత్యనారాయణ తెలిపారు. సోమవారం ఆయన టీడీపీ మండల అధ్యక్షుడు నందిపల్లి వెంకటరమణ మన్యపురట్ల గ్రామ కమిటీని ఏర్పాటు చేశారు. టీడీపీ మన్యపురట్ల అధ్యక్షుడిగా పుణ్యమంతుల బాబ్జీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలాగే పీకేగూడెం గ్రామ అధ్యక్షుడిగా గాడి వెంకటరమణను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కరక సత్యనారాయణ మాట్లాడుతూ మే 10వ తేదీలోపు టీడీపీ గ్రామ కమిటీలు పూర్తయిన వెంటనే మే 15వ తేదీలోపు టీడీపీ మండల కమిటీని ఎన్నుకుంటామన్నారు. ఈ నూతన కమిటీలు వచ్చే స్థానిక ఎన్నికలలో టీడీపీ మద్దతుదారులు గెలవడానికి కష్టపడి పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మన్యపురట్ల మాజీ సర్పంచ్ వనిమిన సూర్యారావు, తాండవ నీటి సంఘం అధ్యక్షుడు అపన దివాణం, అడిగర్ల భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో మాతృ భాషను కొనసాగించాలి

▸▸ ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నూకరాజు డిమాండ్



ధర్నాలో మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నూకరాజు

నర్సీపట్నం, మే 5(ఆంధ్రజ్యోతి) జాతీయ విద్యా విధానం, విద్యా హక్కు ప్రకారం అన్ని పాఠశాలలో మాతృభాష మాధ్యమాన్ని కొనసాగించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.నూకరాజు డిమాండ్ చేశారు. సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద పలు సమస్యల పై ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం జీవో నంబరు 117 ద్వారా విద్యారంగాన్ని అతలాకుతలం చేసిందని విమర్శించారు. ఈ జీవోని రద్దు చేస్తామని ఎన్నికలలో హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం స్పష్టమైన విధానాన్ని అవలంబించకుండా ఇంగ్లీషు మీడియంనే కొనసాగిస్తుందన్నారు. అలాగే ఉపాధ్యాయులకు రావల్సి ఆర్థిక ప్రయోజనాలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. 12వ పీఆర్‌సీని నియమించి వెంటనే ఐఆర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు టి.త్రినాథ్, ప్రధాన కార్యదర్శి ఎస్.దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వెంకన్న కల్యాణోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రాజు, ఇతర నేతలు

చోడవరం, మే 5 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో కల్యాణోత్సవాలకు సంబంధించి ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు ఆదివారం రాత్రి ఇక్కడ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల ఏడవ తేదీన తిరువీధి కార్యక్రమంతో ప్రారంభమయ్యే ఈ ఉత్సవాలు 11వ తేదీ వరకు కొనసాగుతాయన్నారు. ఉత్సవాలను పక్కాగా నిర్వహించాలని కమిటీ సభ్యులకు సూచించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మల్లునాయుడు, పెదబాబు, దేవరపల్లి వెంకట అప్పారావు, సకురు కోటేశ్వరరావు, ఆలయ కమిటీ ప్రతినిధులు వింజమూరి శంకర్, గూనూరు ప్రభాకర్, ఉపాధ్యాయుల శ్రీనివాస్, విస్సు పనసారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శివారు గిరిజన గ్రామాల్లో సమస్యలపై నిరసన


కలెక్టర్ కార్యాలయం ముందు నిరసన తెలుపుతున్న గిరిజనులు

దేవరాపల్లి, మే5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చింతలపూడి పంచాయతీ శివారు గిరిజన గ్రామాలకు విద్యుత్, తాగునీరు వంటి సౌకర్యాలు కల్పించాలని కోరుతూ అక్కడి గిరిజనులు పలువురు నెత్తి పైన ఆకులు పెట్టుకొని అనకాపల్లిలోని జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట సోమవారం నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బి.టి.దొర మాట్లాడుతూ కొక్కిలబంద, జారురాయి, కొత్తవలసలలో పీటీజీ కోందులకు చెందిన గిరిజన తెగలవారు నివశిస్తున్నారన్నారు. వీరు ఇప్పటికీ విద్యుత్, తాగునీరు వంటి సమస్యలు ఎదుర్కొంటున్నారని వాపోయారు. అలాగే మదనగరువు, వంతువానిపాలెం కొండపైన నివశిస్తున్న గిరిజనులకు జల్ జీవన్ మిషన్ కింద తాగునీరు అందించాలని కోరారు. అంతకుముందు సమస్యల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్‌కు వినతి పత్రాన్ని అందజేశారు.

లిక్విడ్ గంజాయితో ఇద్దరి అరెస్టు

బుచ్చెయ్యపేట మే5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఐతంపూడి గ్రామం వద్ద ఇద్దరు వ్యక్తుల నుంచి సోమవారం రెండున్నర లీటర్ల లిక్విడ్ గంజాయిని స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు సిబ్బందితో మాటు వేసి పట్టుకున్నామన్నారు. నిందితుల్లో ఒకరు రావికమతానికి చెందిన స్వీట్‌షాపు యజమాని కాగా, మరొకరు వడ్డాదికి చెందిన వ్యక్తిగా పేర్కొన్నారు. వీరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు చెప్పారు.

'కార్మిక సమస్యల పరిష్కారానికి పోరాటం'

కె.కోటపాడు, మే 5 (ఆంధ్రజ్యోతి) : కార్మిక వర్గానికి నష్టదాయకంగా మారనున్న లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 20న చేపట్టనున్న సమ్మె అంతా జయప్రదం చేయాలని సీఐటీయూ మండల కార్యదర్శి నాయుడుబాబు పిలుపునిచ్చారు. ఇక్కడి సీఐటీయూ కార్యాలయంలో ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను సోమవారం ఆవిష్కరించి మాట్లాడారు. అంగన్‌వాడీ, ఆశ, మధ్యాహ్న భోజన పథకం ఐకేపీ, ఔట్‌సోర్సింగ్ తదితర కార్మికుల సమస్యలపై ఈ ఆందోళన చేపట్టనున్నామన్నారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కోశాధికారి జి.నాయనబాబు మాట్లాడుతూ డాక్టర్ స్వామినాథన్ సిఫార్సుల మేరకు రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల ప్రజా సంఘాలు కన్వీనర్ యర్ర దేముడు, రైతు సంఘం మండల కార్యదర్శి వనము సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


ప్రభుత్వ పాఠశాలలను నిర్వీర్యం చేయొద్దు

▸▸ ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ధర్నా ▸▸ సమస్యలు పరిష్కరించాలని ఉపాధ్యక్షుడు త్రినాథ్ డిమాండ్


తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న ఉపాధ్యాయులు

చోడవరం, మే 5 (ఆంధ్రజ్యోతి) : వివిధ రకాల పాఠశాలల పేరుతో ప్రభుత్వం ప్రాథమిక పాఠశాలలతో ప్రయోగాలు చేయవద్దని ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తమరాన త్రినాథ్ అన్నారు. ఫెడరేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణ పేరిట ఉపాధ్యాయులు సోమవారం ఇక్కడి తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా త్రినాథ్ మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాలలను వివిధ రకాల పేర్లతో ఏర్పాటు చేసి, పూర్తిగా ప్రాథమిక పాఠశాలలను నిర్వీర్యం చేసేందుకు ప్రయత్నాలు చేయడం సరికాదన్నారు. ఒకటి నుంచి ఐదు వరకూ తరగతులను ప్రాథమిక పాఠశాలల్లోనే కొనసాగించాలని, 6 నుంచి 10వరకూ ఉన్నత పాఠశాలల్లో కొనసాగించాలని డిమాండ్ చేశారు. ప్రాథమికోన్నత పాఠశాలలు కొనసాగుతున్న చోట, 6, 7 తరగతులు ఉన్నచోట నాలుగు స్కూల్ అసిస్టెంట్ పోస్టులు, 6, 7 ,8 తరగతులు ఉన్నచోట ఆరు స్కూల్ అసిస్టెంట్ పోస్టుల విధానాన్ని కొనసాగించాలన్నారు. ప్రతి ప్రాథమిక పాఠశాలకు విద్యార్థుల సంఖ్యతో సంబంధం లేకుండా ఇద్దరు ఎస్‌జీటీలను కొనసాగించాలని, పెరిగిన జనాభాకు అనుగుణంగా కొత్తగా ఏర్పాటైన ఆవాసాలలో పాఠశాలలు ఏర్పాటు చేయాలని, రాష్ట్రమంతటా ఏకరీతిలో పదోన్నతుల సీనియారిటీ జాబితా రూపొందించాలని, జాతీయ విద్యా విధానం, విద్యా హక్కు చట్టం ప్రకారం అన్ని పాఠశాలల్లో మాతృభాషా విధానం కొనసాగించాలని డిమాండ్ చేశారు. అలాగే సీపీఎస్, జీపీఎస్ రద్దు చేయడంతో పాటు 2003 డీఎస్సీ వారికి ఓపీఎస్ అమలు చేయాలని, 12వ పీఆర్‌సీ కమిషన్ వెంటనే నియమించి ఐఆర్ ప్రకటించాలని, పెండింగ్‌లో ఉన్న మూడు డీఏలను తక్షణమే ప్రకటించాలని, 11వ పీఆర్‌సీ బకాయిలతో పాటు, ప్రభుత్వ ఉద్యోగులకు ప్రభుత్వం చెల్లించవలసిన అన్ని రకాల బకాయిలు వెంటనే విడుదల చేయాలని కోరారు. అనంతరం తహసీల్దార్ అంబటి రామారావుకు ఉపాధ్యాయులు వినతిపత్రం అందజేశారు. ఈ ఆందోళన కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్. దుర్గాప్రసాద్, జిల్లా ఉపాధ్యక్షుడు ఎం. మహాలక్ష్మినాయుడు, కార్యదర్శి బి.దేముడు బాబు, రాష్ట్ర కౌన్సెలర్లు వి.ప్రసాదరావు, శ్యామ్‌కుమార్, చోడవరం, మాడుగుల, చీడికాడ, రావికమతం, బుచ్చెయ్యపేట, కె.కోటపాడు, దేవరాపల్లి మండల శాఖల ప్రతినిధులు గొల్లు శ్రీనివాసరావు, మల్లేశ్వరరావు, ఆర్.చిరంజీవి, బీవీకే కిశోర్, శేషకుమార్, జీపీఏ నాయుడు, కె.వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

రైతు సేవా కేంద్రం భవనంపై జగన్ బొమ్మ, నవరత్నాల లోగో తొలగింపు



రోలుగుంట, మే 5 (ఆంధ్రజ్యోతి) : కొమరవోలు రైతు సేవా కేంద్రం భవనంపై ఆర్‌బీకే పేరు, మాజీ సీఎం జగన్ ఫొటో, నవరత్నాల లోగోను అధికారులు ఎట్టకేలకు తొలగించారు. 'వైసీపీ సేవలో అధికారులు' శీర్షికతో సోమవారం 'ఆంధ్రజ్యోతి' ప్రచురించిన కథనానికి వెనువెంటనే స్పందించారు. వైసీపీ ప్రభుత్వం మారి కూటమి ప్రభుత్వం ఏర్పాటై పదకొండు నెలలు గడుస్తున్నా ఇంకా రైతు సేవా కేంద్రం భవనంపై మాజీ సీఎం జగన్ ఫొటో, నవరత్నాల లోగో, ఆర్‌బీకే పేరును అలాగే ఉంచి కొనసాగించారు. దీనిపై ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు జారీచేసినా పట్టించుకోలేదు. కథనం ప్రచురితం కావడంతో వారిలో కదలిక ఏర్పడింది.


ముగిసిన ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు

దేవరాపల్లి, మే 5 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న ప్రీమియర్ లీగ్ సీజన్-2 క్రికెట్ పోటీలు సోమవారంతో ముగిశాయి. మండలం నుంచి ఆరు జట్లు తలపడగా నాని, నరేష్ జట్ల మధ్య ఫైనల్ పోరు ఉత్కంఠభరితంగా సాగింది. నాని జట్టు బ్యాటింగ్ ఎంచుకోగా పది ఓవర్లలో 83 పరుగులు చేశారు. 84 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన నరేష్ జట్టు మొదట్లో మంచి స్కోరు సాధించినప్పటికీ మ్యాచ్ డ్రా అయింది. దీంతో సూపర్ ఓవర్ మ్యాచ్ నిర్వహించగా విన్నర్‌గా నాని జట్టు, రన్నర్‌గా నరేష్ జట్టు నిలిచారు. విజేతలకు మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, గొళ్ల రామ్మూర్తి నగదు బహుమతులతో పాటు ట్రోఫీ అందజేశారు. ఈ కార్యక్రమంలో లలితానాయుడు, సింహాచలం నాయుడు, రమణ, అప్పలరాజు, సన్యాసినాయుడు పాల్గొన్నారు.

నేడు బుచ్చెయ్యపేట మండల సర్వసభ్య సమావేశం

బుచ్చెయ్యపేట మే 5 (ఆంధ్రజ్యోతి) ఇక్కడి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం మంగళవారం జరగనుంది. ఎంపీపీ దాకవరపు నాగేశ్వరి దేవి అధ్యక్షతన నిర్వహించనున్న ఈ సమావేశానికి ఎమ్మెల్యే కేఎస్ ఎన్ఎస్ రాజు ముఖ్య అతిథిగా హాజరు కానున్నారని ఎంపీడీవో వి.విజయలక్ష్మి తెలిపారు. మండలంలోని సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, ఆయా శాఖల అధికారులు విధిగా పాల్గొనాల్సిందిగా ఆమె కోరారు.

రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో సతీష్‌కు బంగారు పతకం


పతకంతో పాటు, సర్టిఫికెట్ అందుకుంటున్న పుల్లేగి సతీష్

చోడవరం, మే 5 (ఆంధ్రజ్యోతి) : యోగా కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం విజయవాడలో నిర్వహించిన రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో చోడవరం పతంజలి యోగా కేంద్రం గురువు పుల్లేటి సతీష్‌కు బంగారు పతకం లభించింది. 40 నుంచి 55 సంవత్సరాల విభాగంలో నిర్వహించిన ఈ పోటీల్లో క్లిష్టమైన ఆసనాలు వేసి ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకాన్ని సాధించారు. వచ్చే నెల 6 నుంచి 8 వరకూ కోల్‌కతాలో జరగనున్న జాతీయ స్థాయి యోగా పోటీలకు సతీష్ అర్హత సాధించారు. ఈ సందర్భంగా అతనిని సోమవారం ఇక్కడ డాక్టర్ బంగారు కృష్ణ, పసుమర్తి అశోక్, ఉషోదయ విద్యా సంస్థల చైర్మన్ రమణాజీ తదితరులు అభినందించారు.

మాడుగులలో పాలిటెక్నిక్ కళాశాల

▸▸ ఏర్పాటుకు ప్రయత్నాలు ▸▸ విద్యాలయాల్లో మరిన్ని మౌలిక వసతులు

▸▸ ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి


శిలాఫలకం ఆవిష్కరణలో ఎమ్మెల్యే బండారు, నాయకులు

మాడుగుల రూరల్, మే 5 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గ కేంద్రం మాడుగులలో పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటు చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నామని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి వెల్లడించారు డి.సురవరం కస్తూర్బా విద్యాలయంలో సమగ్ర శిక్ష నిధులతో చేపట్టనున్న అదనపు వసతి గదుల నిర్మాణానికి సోమవారం ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు మెరుగైన మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసాస్తున్నట్టు చెప్పారు. అనాథలు, అభాగ్యులు, ఏ ఆధారంలేని ఆడపిల్లలను అక్కున చేర్చుకుని కస్తూర్బా విద్యాలయాలు చేయూత ఇస్తున్నాయన్నారు. గత ప్రభుత్వ హయాంలో నాడు- నేడు పేరుతో సగంసగం పనులు చేసి బిల్లులు మంజూరు కాక అసంపూర్తిగా ఆపేశారని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తో పాటు విద్యాశాఖ మంత్రి లోకేశ్‌లు విద్యా ప్రమాణాలు మెరుగు పరుస్తూ వసతులపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తున్నారన్నారు. అనంతరం అక్కడికి వచ్చిన ఉపాధి కూలీలతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. వీరవిల్లి అగ్రహారానికి చెందిన దాడిరాజీవ్ అనే యువకుడికి వైద్య ఖర్చులకు మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ రూ.66 వేల చెక్కుని అతని తల్లిదండ్రులకు అందించారు. ఆ తరువాత మాడు గుల ప్రభుత్వ ఆస్పత్రికి ఏర్పాటు చేసిన అంబులెన్స్‌ను జెండా ఊపి ప్రారంభించారు. ఎంపీపీ రాజారామ్, నాయకులు పీవీజీ కుమార్, పుప్పాల అప్పలరాజు, అద్దిపల్లి జగ్గారావు, ఉండూరు దేముడు, సర్పంచ్ జయమ్మ, నాయకులు పుప్పాల రమేశ్, బుద్దాల రమణ, ఉపాధ్యాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ ఆస్తుల సంరక్షణకు ప్రత్యేక చర్యలు

» ఎంపీడీవో శ్రీనివాసరావు



మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీనివాసరావు

చింతపల్లి, మే 5 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఆస్తుల సంరక్షణకు ప్రత్యేక కార్యాచరణ ప్రారంభించామని స్థానిక ఎంపీడీవో యూఎస్వీ శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో మండల అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీ ఆస్తుల గుర్తింపు, సంరక్షణకు ప్రభుత్వం 188 జీవోను జారీ చేసిందని చెప్పారు. పంచాయతీ పరిధిలో కార్యదర్శి, వీఆర్వో, మహిళా కానిస్టేబుల్, ఇంజనీరింగ్ అసిస్టెంట్, గ్రామ సర్వేయర్ కమిటీగా ఏర్పాటు చేశామన్నారు. ప్రధానంగా రహదారులు, డ్రైనేజీలు, ప్రభుత్వ భవనాలు, సంతబయలు ప్రాంతం, బందుదొడ్డి, పశుశాలలు, శ్మశాన వాటికలు, చెరువులు, గ్రామ కంఠం భూములు, ఇతర ప్రభుత్వ ఆస్తులను గుర్తించి సమగ్ర నివేదిక రూపొందించాలని ఆదేశించారు. మండల స్థాయిలో తహసీల్దార్, ఎంపీడీవో, ఈవోఆర్డీ, మండల పంచాయతీరాజ్ ఏఈఈ, ఆర్అండ్బీ ఏఈఈ, ఇరిగేషన్ ఏఈఈ, మండల సర్వేయర్ కమిటీ సభ్యులుగా ఉంటారని ఆయన చెప్పారు. పంచాయతీ పరిధిలో కమిటీ సిఫారసు చేసిన నివేదికను మండల కమిటీ పరిశీలించి డివిజన్ స్థాయికి పంపిస్తామని చెప్పారు. ప్రభుత్వ ఆస్తులు ఆక్రమణలకు గురయ్యాయా?, ఎవరు ఆక్రమించారు? వంటి అంశాలను పరిశీలిస్తామన్నారు. ప్రభుత్వ ఆస్తులను రక్షించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉప తహసీల్దార్ చంద్రశేఖరరావు పాల్గొన్నారు.

కార్మికులందరికీ ఈ-శ్రమ్ కార్డులు జారీ చేయాలి



కార్మికులకు ఈ-శ్రమ్ కార్డులను అందిస్తున్న జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ రాము

పాడేరురూరల్, మే 5(ఆంధ్రజ్యోతి): కార్మికులకు ఈ-శ్రమ్ కార్డులు జారీ చేయాలని జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్, జిల్లా న్యాయ సేవా ప్రాధికార సంస్థ చైర్మన్ ఎ.రాము కార్మిక శాఖను ఆదేశించారు. స్థానిక ప్రథమ శ్రేణి జ్యుడీషియల్ కోర్టు ప్రాంగణంలో సోమవారం కార్మికులు, యజమానులతో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ కార్మికుడికి ఏమైనా అయితే ఈ-శ్రమ్ కార్డు ఉంటే అతని కుటుంబానికి ఆర్థిక భరోసా ఉంటుందన్నారు. కార్డు వల్ల కలిగే లబ్ధి గురించి అవగాహన కల్పించారు. ఎన్ఆర్ఈజీఎస్ వేతనదారులు, భవన నిర్మాణ రంగంలోని కార్మికులు, ఇతర సంస్థలు, దుకాణాల్లో పనిచేస్తున్న వారు ఈ-శ్రమ్ కార్డులను పొందాలని సూచించారు. అనంతరం పలువురు కార్మికులకు ఈ-శ్రమ్ కార్డులను ఆయన పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో చోడవరం కార్మికశాఖాధికారి పి.సూర్యనారాయణ, సీఐ డి.దీనబంధు, ఎక్సైజ్ సీఐ టీవీఎస్ఎన్.ఆచారి, ఎస్ఐ కేశవరావు, పీపీ వి.రమేశ్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు టి.ప్రసాదరావునాయుడు పాల్గొన్నారు.

తహసీల్దార్ రవికుమార్ బదిలీ

చింతపల్లి, మే 5 (ఆంధ్రజ్యోతి): తహసీల్దార్ బి. రవికుమార్‌ను ఆంధ్రప్రదేశ్ సచివాలయానికి బదిలీ చేస్తూ రెవెన్యూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఎనిమిది నెలలుగా రవి కుమార్ తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఉన్నతాధికారులు రవి కుమార్‌ని బదిలీ చేస్తూ ఆయన స్థానంలో జీకే వీధి తహసీల్దార్ టి.రామకృష్ణకు ఇన్‌చార్జిగా బాధ్యతలను అప్పగించారు. ఈమేరకు సోమవారం ఆయన రిలీవ్ అయ్యారు. ఇన్‌చార్జి తహసీల్దార్ మంగళవారం బాధ్యతలు స్వీకరిస్తారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పాడేరురూరల్, మే 5(ఆంధ్రజ్యోతి): పాడేరు మండలంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లలో ఫీడర్ల మరమ్మతుల నేపథ్యంలో మంగళవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఏవీఎస్ఎం అప్పారావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాడేరు మోదకొండమ్మ అమ్మవారి జాతర సందర్భంగా పాడేరు డివిజన్‌లోని సబ్‌స్టేషన్ ఫీడర్ మండల హెడ్ క్వార్టర్ 11 కేవీ లైన్ మరమ్మతులు చేపడుతున్నందున పాడేరు టౌన్, గొందూరు, పాతపాడేరు, కొత్తపాడేరు, గుడివాడ, నీలకంఠనగర్, సుండ్రుపుట్టు ప్రాంతాలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని చెప్పారు. కిండంగి సబ్‌స్టేషన్ పరిధిలోని డోకులూరు ఫీడర్ పరిధి 11 కేవీ లైన్ మరమ్మతుల నేపథ్యంలో నక్కలపుట్టు, కిండంగి, లగిశపల్లి గ్రామాలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందన్నారు. ఆయా గ్రామాల విద్యుత్ వినియోగదారులు విషయాన్ని గుర్తించి విద్యుత్ సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు.

ఉత్తమ విద్యార్థులకు బహుమతులు

కొయ్యూరు, మే 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని గదభపాలెం పంచాయతీ శివారు మల్లవరం గ్రామంలో పదవ తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను సోమవారం హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు టి.మల్లేశ్ పి.సన్యాసిరావు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

'అరకులో మినీ రైల్వే స్టేషన్ అభివృద్ధికి నిధులు మంజూరు'

అరకులోయ, మే 5(ఆంధ్రజ్యోతి): అరకులోయలో రైల్వే రిక్వెస్ట్ స్టాప్ వద్ద మినీ రైల్వేస్టేషన్ అభివృద్ధికి కేంద్ర రైల్వే మంత్రి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారని అరకు ఎంపీ డాక్టర్ తనూజారాణి తెలిపారు. మినీ రైల్వేస్టేషన్ కోసం రూ.2.2 కోట్ల నిధులు మంజూరు చేశారన్నారు. మినీ స్టేషన్ అభివృద్ధికి రైల్వే అధికారులు పంపిన ప్రతిపాదనలకు అవసరమైన నిధులు మంజూరు చేసినట్టు స్వయంగా రైల్వే మంత్రి ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చారని ఆమె తెలిపారు. త్వరలో పనులు ప్రారంభించి గతంలో మాదిరిగా పాసింజర్ రైళ్లు నిలిచే విధంగా చర్యలు తీసుకుంటామని ఆమె ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఏయూ ఇంజనీరింగ్ ఎంట్రన్స్ టెస్ట్‌కు 93.46 శాతం హాజరు

విశాఖపట్నం, మే 5 (ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ కోర్సుల్లో (సెల్ఫ్ సపోర్టు) ప్రవేశాలకు సోమవారం ఆంధ్ర విశ్వవిద్యాలయం నిర్వహించిన ఆఈట్-2025 (ఆంధ్ర యూనివర్సిటీ ఎంట్రన్స్ టెస్ట్)కు 93.46 శాతం మంది విద్యార్థులు హాజరయ్యారు. ప్రవేశ పరీక్షకు మొత్తం 6,028 మంది దరఖాస్తు చేసుకోగా, 5,634 మంది (93.46 శాతం) హాజరయ్యారు. ఏయూ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ జీపీ రాజశేఖర్ గాయత్రీ విద్యాపరిషత్ డిగ్రీ, పీజీ కాలేజీ, లంకపల్లి బుల్లయ్య కాలేజీల్లో పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు.

ఎన్నికల హామీలను అమలు చేయని ప్రభుత్వం

» సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి

ఎలమంచిలి, మే 5 (ఆంధ్రజ్యోతి):ఎన్నికల్లో ఎన్డీయే ఇచ్చిన హామీలను పూర్తి స్థాయిలో అమలు చేయలేదని భారత కమ్యూనిస్టు పార్టీ(సీపీఐ)రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ. సత్యనారాయణమూర్తి ఆరోపించారు. సోమవారం పట్టణంలో సీపీఐ 2వ జిల్లా మహాసభను నిర్వహించారు. తొలుత ఆర్టీసీ బస్టాండ్ జంక్షన్ నుంచి రైల్వే స్టేషన్ రోడ్డు మీదుగా ర్యాలీ గురవప్ప కల్యాణ మండపం వరకూ సాగింది. అనంతరం గురవప్ప కల్యాణ మండపం వద్ద ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ తాము అధికారంలోకి వస్తే ఏడాదికి 2 కోట్ల మంది నిరుద్యోగులకు ఉద్యోగాలిస్తామని హామీ ఇచ్చారని నెరవేర్చాలన్నారు. ఎన్నడూ లేని విధంగా నిరుద్యోగం పెరిగిపోయిందన్నారు. భారతీయ సమాజం ఐకమత్యంలో భిన్నత్వంలా ఉంటుందని, అసమానతలను తగ్గించేందుకు కులగణన ఉపయోగపడుతుందన్నారు. స్థానికంగా నెలకొల్పే పరిశ్రమల్లో స్థానికులకు 70 శాతం మందికి ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. పేదవాడికి సొంతింట కళ నెరవేర్చేందుకు అండగా సీపీఐ అండగా నిలుస్తుందన్నారు. అనంతరం సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గుజ్జల ఈశ్వరయ్య, జిల్లా కార్యదర్శి బీవీ. రమణలు ఈ మహాసభలు విధి విధానాలను వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మానం ఆంజనేయులు, సీపీఐ నేతలు ఎం.రాయునాయుడు, ఆర్.దొరబాబు, కార్యవర్గ సభ్యులు కె.సన్యాసిరావు, ఆర్.జగ్గారావు, సీహెచ్. క్రాంతి, బి. సుబ్బలక్ష్మి పాల్గొన్నారు.

ఘనంగా మర్రి కామయ్య వర్ధంతి

స్వాతంత్ర్య సమరయోధుడికి పలువురి నివాళి

హుకుంపేట, మే 5 (ఆంధ్రజ్యోతి): గిరిజన స్వాతంత్ర్య సమర యోధుడు మర్రి కామయ్య వర్ధంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. మర్రి కామయ్య ఆశయ సాధనకు గిరిజనులు కృషి చేయాలని గిరిజన సంఘం జాతీయ కార్యదర్శి పి.అప్పల నర్స పిలుపునిచ్చారు. స్థానిక మెయిన్ రోడ్డులో మర్రి కామయ్య విగ్రహానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజనుల కోసం బ్రిటీష్ పాలకులను మర్రి కామయ్య ధైర్యంగా ఎదిరించారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం మండల అధ్యక్షుడు టి.కృష్ణారావు, హైమావతి, గిరిజన ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కాంతారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అరకులోయలో...

అరకులోయ: స్వాతంత్ర్య సమరయోధుడు మర్రి కామయ్య వర్ధంతి సందర్భంగా ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో అరకులోయ ఎంపీడీవో కార్యాలయం వద్ద కామయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పొద్దు బాలదేవ్ ఆధ్వర్యంలో గిరిజన సంఘం నేతలతో పాటు ఎంపీడీవో ఎ.లోవరాజు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాలదేవ్ మాట్లాడుతూ మర్రి కామయ్య స్ఫూర్తితో ఆదివాసీల హక్కులను కాపాడుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం మండల అధ్యక్షుడు, సుంకరమెట్ట సర్పంచ్ గెమ్మెలి చినబాబు, గిరిజన సంఘం మండల నాయకులు పాల్గొన్నారు.

పాడేరులో...

పాడేరురూరల్: గిరిజన స్వాతంత్ర్య సమరయోధుడు మర్రి కామయ్య వర్ధంతిని సలుగు పంచాయతీ, బూరుగుచట్టు గ్రామంలో సోమవారం నిర్వహించారు. బూరుగుచట్టు పెసా కమిటీ సభ్యుడు జి.సత్యారావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొని కామయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

పెదబయలులో..

పెదబయలు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం గిరిజన స్వాతంత్ర్య పోరాట యోధుడు మర్రి కామయ్య వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో పూర్ణయ్య, తహసీల్దార్ రంగారావు, వైస్ ఎంపీపీ రాజుబాబు, టీడీపీ మండల అధ్యక్షురాలు సుకుమారి, పాంగి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



హుకుంపేటలో మర్రి కామయ్య విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం



అరకులోయలో నివాళులర్పిస్తున్న దృశ్యం



పెదబయలు ఎంపీడీవో కార్యాలయంలో నివాళులర్పిసున్న దృశ్యం

స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలి

» బీజేపీ కార్యకర్తలకు ఆ పార్టీ రాష్ట్ర సంఘటన్ ప్రముఖ్ నూకల మధుకర్



బీజేపీ జిల్లా కార్యవర్గ సమావేశంలో మాట్లాడుతున్న మధుకర్

పాడేరురూరల్, మే 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు బీజేపీ కార్యకర్తలు సిద్ధం కావాలని ఆ పార్టీ రాష్ట్ర సంఘటన్ ప్రముఖ్ నూకల మధుకర్ పిలుపునిచ్చారు. స్థానిక మోదకొండమ్మ ఆడిటోరియంలో జిల్లా అధ్యక్షురాలు మఠం శాంతకుమారి అధ్యక్షతన సోమవారం నిర్వహించిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండల, బూత్ లెవల్ కమిటీలు కేంద్ర ప్రభుత్వ పథకాలను విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. బీజేపీని సంస్థాగతంగా బలోపేతం చేయడానికి కార్యకర్తలు అకుంఠిత దీక్షతో పనిచేయాలని కోరారు. ప్రధాని మోదీ ప్రాజెక్టుల అభివృద్ధికి, అమరావతి నిర్మాణానికి, రాష్ట్రాభివృద్ధికి వేల కోట్ల రూపాయలు మంజూరు చేస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో డబుల్ ఇంజన్ సర్కార్ ఉందని, వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలకు కార్యకర్తలు ఇప్పటి నుంచే కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను గ్రామాల్లో ప్రచారం చేయాలన్నారు. బీజేపీ మండల అధ్యక్షులు స్థానిక అధికారులతో పరిచయాలు పెంచుకోవాలని, గ్రామాల్లో పర్యటించి అభివృద్ధి పథకాలు అమలు జరిగేలా చూడాలని సూచించారు. జూన్ నెలకు మండల, బూత్ లెవల్ కమిటీలు పూర్తి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో రాష్ట్ర సోషల్ మీడియా కన్వీనర్ కేశవ్‌కాంత్, జిల్లా ఎన్నికల ఇన్‌చార్జి పుట్టా గంగయ్య, ట్రైకార్ డైరెక్టర్ కృష్ణారావు, జిల్లా పార్టీ మాజీ అధ్యక్షుడు పాంగి రాజారావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కురసా రాజారావు, సాగర ఎంపీటీసీ సభ్యుడు వంతాల దేవదాస్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ మచ్చల మంగతల్లి, మైనారిటీ మోర్చ రాష్ట్ర కార్యదర్శి పెనుమాక రవికుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి సల్లా రామకృష్ణ, బొజ్జిరెడ్డి, జిల్లా కార్యదర్శి స్వప్నకుమారి, డాక్టర్ రాఘవేంద్రరావు, ముఖ్య నాయకులు వేమనబాబు, సుబ్రహ్మణ్యం, వి.రామచందర్, తదితరులు పాల్గొన్నారు.

పెదపాడులో తాగునీటి సమస్య పరిష్కారం



పెదపాడు గ్రావిటీ పథకం ద్వారా నీటి సరఫరాను పరిశీలిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ కల్యాణ్‌రామ్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

గూడెంకొత్తవీధి, మే 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దేవరాపల్లి పంచాయతీ పెదపాడు గ్రామంలో తాగునీటి సమస్యను ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీర్ అధికారులు పరిష్కరించాలని ఎంపీడీవో వై.ఉమామహేశ్వరరావు ఆదేశించారు. సోమవారం 'పెదపాడులో దాహం కేకలు' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. ఆ గ్రామాన్ని సందర్శించి తాగునీటి సమస్యను పరిష్కరించాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ కల్యాణ్ రామ్, పంచాయతీ కార్యదర్శి పెదపాడు గ్రామాన్ని సందర్శించారు. గ్రామంలో మరుగునపడివున్న గ్రావిటీ పథకాన్ని పరిశీలించారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు గ్రావిటీ పథకానికి నీటి సరఫరా చేస్తున్న కొండవాగు జలాలు అంతరించిపోవడంతో ప్రత్యామ్నాయంగా రెండు వందల మీటర్ల దూరంలో ఉన్న మరో కొండవాగుకి అనుసంధానం చేశారు. పాడైపోయిన పైపులైన్లు తొలగించి కొత్తవి ఏర్పాటు చేశారు. దీంతో గ్రావిటీ పథకం ద్వారా మంచినీటి సరఫరాను ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పునరుద్ధరించారు. దీంతో స్థానిక గిరిజనులు రెండు నెలలుగా ఎదుర్కొంటున్న మంచి నీటి సమస్యకు పరిష్కారం లభించింది. తాగునీటి సమస్యను ఒక్కరోజులో పరిష్కారానికి కృషి చేసిన 'ఆంధ్రజ్యోతి'కి పెదపాడు గిరిజనులు కృతజ్ఞతలు తెలిపారు.

టెన్త్ సప్లిమెంటరీ విద్యార్థులు హాజరుకావాలి

సీలేరు, మే 5 (ఆంధ్రజ్యోతి): టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు తప్పనిసరిగా ప్రత్యేక తరగతులకు హాజరుకావాలని జీకేవీధి ఎంఈవో రామన్నపడాల్ తెలిపారు. సోమవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రత్యేక తరగతులను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 33 మంది టెన్త్ విద్యార్థులకు గాను ఆరుగురు మాత్రమే ఉత్తీర్ణత సాధించారన్నారు. ప్రస్తుతం 27 మంది అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు రాయనున్నారన్నారు. ఫెయిల్ అయిన విద్యార్థులందరూ ఉత్తీర్ణులయ్యేందుకు ఈ నెల 18 వరకు ప్రత్యేక తరగతుల బోధన జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్ఎం కాలేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పూర్వ ప్రాథమిక విద్యా విధానాన్ని అమలు చేయాలి

చింతపల్లి, మే 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పూర్వ ప్రాథమిక విద్యా విధానాన్ని అమలు చేయాలని ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు దేపూరి శశి కుమార్ కోరారు. సోమవారం ఏపీటీఎఫ్ నాయకులు ఆందోళన చేపట్టారు. అనంతరం ఉప తహసీల్దార్ చంద్రశేఖరరావుకి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ నాయకులు చంద్రరావు, ప్రధాన కార్యదర్శి సురేశ్, రెడ్డి వెంకటేశ్వర్లు, గెమ్మెలి కామేశ్వరరావు, పాత్రుడు, చిట్టినాయుడు పాల్గొన్నారు.

తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ కార్మికుల నిరసన

పాడేరురూరల్, మే 5(ఆంధ్రజ్యోతి): ఆరోగ్య శాఖలో తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ విభాగంలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఎల్.సుందరరావు డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్‌లో పనిచేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం కలెక్టర్ కార్యాలయం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సుందరరావు మాట్లాడుతూ తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్‌లో రాష్ట్ర వ్యాప్తంగా 500 మంది కెప్టెన్ (డ్రైవర్)లుగా పని చేస్తున్నారన్నారు. వారంతా ప్రస్తుతం అరబిందో(ఏఈఎంఎస్)సంస్థ ద్వారా వైద్య ఆరోగ్య శాఖలో సేవలు అందిస్తున్నారని చెప్పారు. అరబిందో యాజమాన్యం వారికి ఏడేళ్లుగా నెలకు రూ.8,800 మాత్రమే వేతనం చెల్లిస్తోందని అన్నారు. సీటీసీ పేరిట యాజమాన్యం కట్టాల్సిన పీఎఫ్ వాటాను కూడా ఉద్యోగుల వేతనాల నుంచే మినహాయిస్తూ యాజమాన్యం చట్టాన్ని ఉల్లంఘిస్తోందని ఆరోపించారు. చట్ట ప్రకారం అమలు చేయాల్సిన సెలవులను కూడా అమలు చేయడం లేదని, ఇంక్రిమెంట్లు ఇవ్వడం లేదన్నారు. ప్రభుత్వం స్పందించి యాజమాన్యంలో అవుట్ సోర్సింగ్ డ్రైవర్ల వేతనం నెలకు రూ. 18.500 చెల్లించాలని, పీఎఫ్, ఈఎస్ఐ యాజమాన్యమే చెల్లించాలని, చట్ట ప్రకారం వారాంతపు, పండగ, జాతీయ సెలవులు అమలు చేయాలని, విధి నిర్వహణకు అవసరమైన సెల్‌ఫోన్లు ఇవ్వాలని, ప్రమాదాలు జరిగినప్పుడు మృతి చెందిన కార్మికులకు ఆరోగ్య బీమా, ఎక్స్‌గ్రేషియా, ఇన్సూరెన్స్ సౌకర్యాలు కల్పించాలని, 8 గంటల పని విధానం అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టర్‌కు అందించారు. ఈ కార్యక్రమంలో తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ కార్మికులు సింహాచలం, కొండబాబు, విష్ణు, మౌళి, రాజారావు, దుర్గాప్రసాద్, బాలన్న, జయరాం, అనిల్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్ దృష్టికి బొయితిలి సమస్యలు

జి.మాడుగుల, మే (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొయితిలి పంచాయతీ పరిధి గ్రామాల సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్‌ను కోరినట్టు ఆ పంచాయతీ వాసులు తెలిపారు. పంచాయతీలోని జాములువీధి, వై.రాపల్లి, పెద్దగరువు, చదురుమామిడి, బూసులుకోట, బొయితిలి, బూరుగువీధి తదితర గ్రామాల్లో తాగు, సాగు నీరు, సీసీ రహదారులు సమస్యలు పరిష్కరించాలని కోరామన్నారు. దీనికి కలెక్టర్ సానుకూలంగా స్పందించారన్నారు.ఈ కార్యక్రమంలో బీసీవై పాడేరు నియోజకవర్గ నాయకుడు కె.రాజన్, జనసేన మండల నాయకుడు టి.వెంకటరమణ, సత్తిబాబు, రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

గిరిజన సమస్యలపై మంత్రికి వినతి

పాడేరు, మే 5(ఆంధ్రజ్యోతి): గిరిజనులకు సంబంధించిన పలు సమస్యలపై రాష్ట్ర మహిళా శిశు, గిరిజన సంక్షేమ శాఖల మంత్రి గుమ్మడి సంధ్యారాణికి సోమవారం సాలూరులో వినతి పత్రం సమర్పించామని ఆదివాసీ జేఏసీ జిల్లా కన్వీనర్ రామారావుదొర విలేకరులకు తెలిపారు. ముఖ్యంగా గిరిజన ప్రాంతంలో ఉద్యోగాలన్నీ గిరిజనులకు ఇవ్వాలని, మెగా డీఎస్సీలో గిరిజన ప్రాంత టీచర్ పోస్టులను మినహాయించి ప్రత్యేక గిరిజన డీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నేతలు ముఖిశేషాద్రి, ఈశ్వరరావు, సోంబాబు, సురేశ్, నందు, తదితరులు పాల్గొన్నారు.

మంత్రిని కలిసి ఎంపీపీ

జి.మాడుగుల, మే 5 (ఆంధ్రజ్యోతి) : జి.మాడుగుల మండల అభివృద్ధికి కృషి చేయాలని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖా మంత్రి గుమ్మడి సంధ్యారాణిని కోరినట్టు ఎంపీపీ అప్పలరాజు తెలిపారు. సోమవారం ఆయన టీడీపీ ఎస్టీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సోమెలి చిట్టిబాబుతో కలిసి మంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు.

ప్రజా సమస్యలపై వాడీవేడిగా చర్చ

... 5వ పేజీ తరువాయి

చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తీసుకెళితే ఆమె మృతిచెందిందని, అక్కడ వున్న సిబ్బంది ఆమె చెవి దుద్దులు చోరీ చేశారని అన్నారు. ఎస్పీ తుహిన్ సిన్హా స్పందిస్తూ.. దీనిపై కేసు నమోదు చేసి, విచారణ జరుపుతున్నామన్నారు. సమావేశానికి ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, జీవీఎంసీ మేయర్ పీలా శ్రీనివాసరావు, వివిధ కార్పొరేషన్‌ల చైర్మన్లు బత్తుల తాతయ్యబాబు, గండి బాబ్జీ, మళ్ల సురేంద్ర, పీవీజీ కుమార్, జేసీ జాహ్నవి, వివిధ శాఖల అధికారులు హాజరయ్యారు.

పల్లె పండగ బకాయిలు రూ.20 కోట్లు

... 5వ పేజీ తరువాయి

జరుగుతున్నాయి. కాంట్రాక్టర్లకు రూ.3.22 కోట్ల బిల్లులు రావాల్సి వుంది.

నాతవరం మండలంలో రూ.15 కోట్ల విలువ చేసే 167 పనులు మంజూరు కాగా రూ.9.42 కోట్లతో 142 పనులు పూర్తి చేశారు. ఇంకా రూ.4.82 కోట్ల విలువ చేసే 22 పనులు వివిధ దశల్లో ఉన్నాయి. రూ.79 లక్షల విలువైన మూడు పనులు మొదలు పెట్టలేదు. కాంట్రాక్టర్లకు రూ.6.26 కోట్ల మేర బకాయిలు వున్నాయి..

గొలుగొండ మండలంలో రూ.9.72 కోట్ల విలువైన 170 పనులు మంజూరయ్యాయి. రూ.6.25 కోట్లతో 156 పనులు పూర్తి చేశారు. రూ.2.44 కోట్ల విలువైన ఎనిమిది పనులు జరుగుతున్నాయి. రూ.కోటి విలువైన ఆరు పనులు మొదలు కాలేదు. కాంట్రాక్టర్లకు రూ.4.85 కోట్లమేర బిల్లులు పెండింగ్‌లో వున్నాయి.

మాకవరపాలెం మండలంలో రూ.12.41 కోట్లతో 127 అభివృద్ధి పనులు మంజూరయ్యాయి. రూ.8 కోట్లతో 106 పనులు పూర్తి చేశారు. రూ.3.61 కోట్ల విలువ చేసే 12 పనులు కొనసాగుతున్నాయి. రూ.75 లక్షల విలువ చేసే తొమ్మిది పనులు మొదలు కాలేదు. కాంట్రాక్టర్లకు సుమారు రూ.6 కోట్ల వరకు బకాయిలు వున్నాయి.

ఖాకీ అడ్డదారి!

... 5వ పేజీ తరువాయి

ప్రత్యేక ఇంటెలిజెన్స్ విభాగానికి బదిలీ అయ్యారు.

సొంత పనులకు గన్‌మెన్

కాగా సదరు అధికారి రక్షణ కోసం ప్రభుత్వం కేటాయించిన గన్‌మెన్‌ను వ్యక్తిగత పనులకు వినియోగిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పెందుర్తి సమీపంలో ఈ అధికారి ఓ భవనాన్ని నిర్మిస్తున్నారు. అందులో ఇంటీరియర్, కార్పెంటర్ పనులు చేస్తున్న వారికి సహాయకులుగా ఉండాలని ఇద్దరు గన్‌మెన్‌ను ఆదేశించారు. పెంపుడు కుక్కలను చూసుకునే బాధ్యత కూడా గన్‌మెన్‌లకే అప్పగించారని తెలిసింది. అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి మండలం అన్నవరం వద్ద గిరిజనుడి పేరుతో ప్రైవేటు రిసార్టు నిర్మిస్తున్నారనే ఆరోపణలున్నాయి. వీటిపై కొందరు ఇటీవల ఆధారాలతో సహా ఏసీబీకి ఫిర్యాదు చేయడంతో వారు ప్రత్యేక దృష్టిసారించారని పోలీస్ శాఖలో ప్రచారం జరుగుతోంది.

ఈపీడీసీఎల్ అత్యుత్సాహం

... 5వ పేజీ తరువాయి

అక్కడి ఉద్యోగులు ఎవరూ మాట్లాడలేదు. ఇప్పుడు స్థానిక నేతలను పట్టుకున్నారు. పాత తీర్మానాల ప్రకారం పీఆర్‌సీని అమలు చేస్తూ జీతాలు ఇచ్చేయడానికి రంగం సిద్ధం చేశారు. ఇందుకు అనకాపల్లి ఎస్ఈ ప్రతిపాదనలు పంపడం, విశాఖలోని కార్పొరేట్ కార్యాలయం ఆమోదించడం జరిగిపోయింది. ఇంతలో లుకలుకలు మొదలు కావడంతో ఒక అడుగు వెనక్కి వేశారు. అయితే ఇప్పటికే చాలామంది ఉద్యోగుల బ్యాంకు ఖాతాల్లో పెరిగిన జీతాలు పడిపోయాయి. ఎవరూ నోరు విప్పడం లేదు.

అది చట్ట విరుద్ధం

సొసైటీలో అర్హతల ప్రామాణికంగా కాకుండా రాజకీయ సిఫారసులతో ఉద్యోగాలు ఇచ్చారు. ఈపీడీసీఎల్‌లో రిక్రూట్‌మెంట్ ద్వారా నియామకాలు జరుగుతున్నాయి. వీరితో సమానంగా సొసైటీ ఉద్యోగులకు జీతాలు ఇవ్వడానికి నిబంధనలు ఒప్పుకోవు. అందుకని పాత పాలకవర్గం అప్పట్లో చేసిన తీర్మానం ప్రకారం 2022 పీఆర్‌సీ అమలు చేస్తున్నామని నోట్ తయారుచేసి, దాని ప్రకారం అందరికీ జీతాలు పెంచేశారు. ఇది కూడా తప్పే. ప్రస్తుతం సొసైటీకి స్వయంగా జిల్లా కలెక్టరే పర్సన్ ఇన్‌చార్జిగా ఉన్నారు. ఆమె అందుకు ఎలా అంగీకరించారనేది అర్థం కావడం లేదు. ఆ జిల్లా ఎస్ఈ సొసైటీ ఇన్‌చార్జి ఎండీగా వ్యవహరిస్తున్నారు. వారిపై రాజకీయ ఒత్తిళ్లు పెట్టి పీఆర్‌సీ అమలు చేసినట్టు విశ్వసనీయంగా తెలిసింది.

తేలుకుట్టిన దొంగల్లా...

పీఆర్‌సీ అమలుపై ఈపీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో వివరణ కోరితే, సొసైటీ నుంచి ప్రతిపాదనలు వచ్చాయని, బిల్లులు పెడితే ఎప్పటిలాగే ఇచ్చామని, తమ తప్పు ఏమీ లేదని, ప్రత్యేక ఉత్తర్వులు ఏవీ లేవని 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. అనకాపల్లి జిల్లా అధికారిని వివరణ కోరితే, కార్పొరేట్ కార్యాలయమే జీతాలు విడుదల చేసిందని, తమ ప్రమేయం ఏమీ లేదని, పాత పాలకవర్గం తీర్మానం ఆధారంగా చేసుకొని పీఆర్‌సీ ఇచ్చామని తెలిపారు. జిల్లా స్థాయి సహకార శాఖ అధికారిని దీనిపై ప్రశ్నిస్తే...ఆర్ఈసీఎస్‌కు పీఆర్‌సీ వర్తించదని చాలా స్పష్టంగా చెప్పారు.

పదవీ విరమణ వయస్సు పెంపునకు నిరాకరణ

ఇటీవల అనకాపల్లి నేత ఒకరు ఆర్ఈసీఎస్ ఉద్యోగుల పట్ల ప్రత్యేక ప్రేమ చూపిస్తూ వారికి పదవీ విరమణ వయస్సు 58 నుంచి 62 ఏళ్లకు పెంచాలని సహకార సంస్థకు రాశారు. దీనిపై కమిషనర్ చట్టాలన్నీ పరిశీలించి, అలా కుదరదని, ప్రభుత్వ ఉద్యోగుల్లా 62 ఏళ్లు చేయలేమని గత నెలలో ఫైల్ వెనక్కి తిప్పి పంపించారు.

ఇదే సొసైటీలో అక్రమాలపై విచారణ చేయాలని ఎమ్మెల్యే అసెంబ్లీలో కోరితే ప్రభుత్వం 51ఏ విచారణకు ఆదేశించింది. ఒక వైపు విచారణ జరుగుతూ, మరో వైపు ఆపరేషన్లన్నీ ఈపీడీసీఎల్‌కు అప్పగించిన నేపథ్యంలో అక్కడి ఉద్యోగులకు పీఆర్‌సీ ఎలా ఇస్తారనేది అర్థం కాని వ్యవహారం. ఈ విషయంలో లోపాయికారీ ఒప్పందాలు భారీగా జరిగాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని అనకాపల్లి కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ఫిర్యాదు కూడా చేశారు.

అర్జీల పరిష్కారానికి సత్వర చర్యలు

అధికారులకు కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశం



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ విజయకృష్ణన్

తుమ్మపాల, మే 5 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో అందిన అర్జీలపై సంబంధిత శాఖల అధికారులు సత్వర చర్యలు చేపట్టాలని కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో ఆమె మాట్లాడుతూ, ప్రజలు అందిస్తున్న ఫిర్యాదుదారులకు సంబంధించిన సమస్యలను శాశ్వతంగా పరిష్కరించడానికి చొరవ చూపాలన్నారు. అనంతరం ప్రజలు నుంచి అర్జీలు స్వీకరించారు. దేవరాపల్లి మండలం చింతలపూడి పంచాయతీ కొప్పులబంధ, జారురాయి, కొత్తవలస గ్రామాలకు విద్యుత్తు, తాగునీరు, రోడ్డు వంటి మౌలిక సదుపాయాలు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కొద్దిసేపు కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి, డీఆర్‌వో వై.సత్యనారాయణరావు, పలు శాఖల అధికారులుపాల్గొన్నారు.

జిల్లా పోలీస్ కార్యాలయంలో..



అర్జీదారుతో మాట్లాడుతున్న ఎస్పీ సిన్హా

జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో ఎస్పీ తుహిన్ సిన్హా ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మొత్తం 32 ఫిర్యాదు/ వినతులు అందాయని, వీటిని సత్వరమే పరిష్కరించడానికి కృషి చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎల్.మోహనరావు, సీఐలు బాల సూర్యారావు, అప్పలనాయుడు, వెంకన్న పాల్గొన్నారు.

జూన్ నుంచి కార్యకర్తల సమస్యలు పరిష్కారం

అర్హులకు సంక్షేమ ఫలాలు అందాలి ▸ అంతా కలిసికట్టుగా ముందుకు సాగాలి ▸ నియోజకవర్గ టీడీపీ శ్రేణుల సమావేశంలో మంత్రి 'కొల్లు'



నియోజకవర్గ టీడీపీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొల్లు రవీంద్ర

సబ్బవరం, మే5 (ఆంధ్రజ్యోతి) : అన్ని రంగాల్లో తీవ్రంగా నష్టపోయిన రాష్ట్రాన్ని గాడిన పెట్టేందుకు కూటమి ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తున్నట్టు జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. పెందుర్తి నియోజకర్గ టీడీపీ ఇన్‌చార్జి, ఆంధ్రప్రదేశ్ ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్ గండి బాబ్జీ అధ్యక్షతన సోమవారం ఇక్కడ సబ్బవరం, పరవాడ, పెందుర్తి, పెద గంట్యాడ మండలాల నాయకులు, కార్యకర్తల సమావేశం ఏర్పాటైంది. ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామన్నారు. ఇవి అర్హులకు చేరేందుకు అంతా కృషి చేయాలన్నారు. నియోజకవర్గంలో కార్యకర్తల సమస్యలను టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు, నియోజకవర్గ ఇన్‌చార్జి గండి బాబ్జీ తన దృషికి తీసుకు వచ్చారన్నారు. సమస్యలు పరిష్కరించేందుకు చొరవ తీసుకుంటానని హామీ ఇచ్చారు. మహానాడు అనంతరం జూన్ నుంచి కార్యకర్తల సమస్యలన్నీ పరిష్కరిస్తామని చెప్పారు. పార్టీని సంస్థాగతంగా నిల బెట్టేందుకు అంతా కలిసికట్టుగా పని చేయాలన్నారు. గ్రామ, మండల, నియోజకవర్గ కమిటీలన్నీ పది రోజుల్లో పూర్తిచేసి నివేదికలు ఇవ్వాలని సూచించారు. ఎంత మంది నాయకులు ఉన్నా పార్టీయే సుప్రీంగా పేర్కొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించేలా బూత్‌స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. కుటుంబ సాధికార సమితిల ఏర్పాటు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. గండి బాబ్జీ, బత్తుల తాతయ్యబాబు, కొంత మంది ముఖ్య కార్యకర్తలు మాట్లాడుతూ సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. అనంతరం మంత్రిని గండి బాబ్జీ, ఆయన తనయుడు గండి వంశీదీప్, తెలుగు యువత అధ్యక్షుడు పీవీబీఎస్ఎన్ రాజు, మాజీ ఎంపీపీ గండి దేముడు ఘనంగా సత్కరించారు. నాయకులు గండి దేముడు, వియ్యపు చిన్నా, మాసవరపు అప్పలనాయుడు, దాట్ల మధు, మొల్లి ముత్యాలనాయుడు, పల్ల తాతారావు, కరణం రామునాయుడు, కోరాడ శ్రీను, కార్పొరేటర్లు, సర్పంచులు, ఎంపీటీసీలు, వార్డు, గ్రామ కమిటీల అధ్యక్షులు పాల్గొన్నారు.

నేడు దుర్గమాంబ అనుపోత్సవం



సబ్బవరం, మే 5 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం సబ్బవరంలో దుర్గమాంబ అనుపోత్సవం మంగళవారం ఘనంగా జరగనుంది. ఇందుకు సంబంధించి నిర్వాహకులు భారీ ఏర్పాట్లు చేపట్టారు. వేకువజామున అమ్మ వారికి విశేష పూజలు నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించనున్నారు. మధ్యాహ్నం మేళతాళాలు, బాజాభజంత్రీల నడుమ అమ్మవారిని ఊరే గించిన అనంతరం అనుపోత్సవం నిర్వహించనున్నారు. రాత్రికి పలు సంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్టు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.

7న వాసవీమాత జన్మదిన వేడుకలు



అనకాపల్లి టౌన్, మే 5 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో గల కన్యకాపరమేశ్వరీ ఆలయంలో అమ్మవారి జన్మదిన వేడుకలను ఈ నెల ఏడో తేదీన ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని ఆలయ అధ్యక్షుడు బిళ్లపాటి కృష్ణకుమార్ తెలిపారు. ఆ రోజు పల్లకీ ఊరే గింపు, తిరువీధి మహోత్సవం, గోపూజ, నగరేశ్వరస్వామి, జనార్ధనస్వామి వారికి అభిషేకాలు వంటివి ఉంటాయన్నారు. అలాగే, అమ్మవారికి లక్ష మల్లెలతో అర్చన, సామూహిక లలితా సహస్ర నామపారాయణం, అన్న సమారాధన, 102 రకాల మిఠాయిలతో అమ్మవారికి నైవేద్యం వంటి కార్యక్రమాలు చేపట్టనున్నట్టు చెప్పారు. ఉత్సవ విగ్రహాన్ని ఆలయం చుట్టూ వెండి రథంపై ఊరేగిస్తామన్నారు. పెద్ద సంఖ్యలో భక్తులు వేడుకల్లో పాల్గొనాల్సిందిగా కోరారు.

మధ్యాహ్నం వరకు ఎండ.. సాయంత్రం వర్షం

అనకాపల్లి, మే 5 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో భిన్న వాతావరణం నెలకొంది. సోమవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు దాదాపు అన్ని మండలాల్లో ఎండ తీవ్రత అధికంగా వుంది. రెండు రోజులపాటు కురిసిన వర్షాలతో వాతావరణంలో తేమ శాతం పెరగడంతో ఉక్కపోత అధికంగా వుంది. అయితే సాయంత్రానికి వాతావరణం చల్లబడి పలు మండలాల్లో తేలికపాటి జల్లులు కురిశాయి. ఇదిలావుండగా జిల్లాలో ఆదివారం రాత్రి 8.30 గంటల నుంచి సోమవారం ఉదయం 8.30 గంటల వరకు పలు మండలాల్లో మోస్తరు వర్షం కురిసింది. పాయకరావుపేటలో అత్యధికంగా 48.2 మిల్లీ మీటర్ల వర్షంపాతం నమోదైంది. మాడుగులలో 8.4 మి.మీ.లు, గొలుగొండలో 8.2, నక్కపల్లిలో 8, నాతవరంలో 6.2, రాంబిల్లిలో 6.2, కోటవురట్లలో 4.8, రావికమతంలో 4.2, అనకాపల్లిలో 4.2, ఎలమంచిలిలో 4, పరవాడలో 3.8, నర్సీపట్నంలో 3.4, బుచ్చెయ్యపేటలో 3.2, అచ్యుతాపురంలో 3.2, ఎస్.రాయవరంలో 3.2, రోలుగుంటలో 3, మునగపాకలో 2.8, మాకవరపాలెంలో 2.6, చీడికాడలో 1.8, సబ్బవరంలో 1.4, కె.కోటపాడులో 1.2, చోడవరంలో 1.2, కశింకోటలో 1.2, దేవరాపల్లిలో ఒక మిల్లీమీటరు వర్షపాతం నమోదైంది. రాగల 48 గంటల్లో ఈదురు గాలులతో వర్షాలు కురిసే అవకాశం వుందని వాతావరణ శాఖ తెలిపింది.

శతశాతం రాయితీపై నీటి తొట్టెల నిర్మాణం

సబ్బవరం, మే 5 (ఆంధ్రజ్యోతి) : వేసవిలో పల్లెల్లో పశువుల దాహార్తిని తీర్చేందుకు తొట్టెలు నిర్మిస్తున్నట్టు ఎంపీడీవో పి.పద్మజ తెలిపారు. తవ్వవానిపాలెంలో నిర్మించిన నీటి తొట్టెను సోమవారం పరిశీలించిన అనంతరం ఆమె మాట్లాడారు. మండలంలోని 24 పంచాయతీల పరిధిలో ఇప్పటి వరకూ 17 తొట్టెల నిర్మాణం జరిగిందన్నారు. వీటిని నిర్మించుకునేందుకు ఒకేదగ్గర కళ్లాలు ఉన్న రైతులు ముందుకు వస్తే శతశాతం రాయితీపై మంజూరు చేస్తామన్నారు. ఒక్కో తొట్టి నిర్మాణానికి రూ.22 వేల నుంచి రూ.25 వేల వరకు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు.

ఆర్టీసీ కార్మికుల సమస్యలపై ఆర్డీవోకు వినతి

అనకాపల్లి టౌన్, మే 5 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎన్ఎంయూఏ ప్రతినిధులు సోమవారం ఆర్డీవో షేక్ ఆయీషాను కలిసి వినతిపత్రం అందజేశారు. గత 66 రోజులుగా డిపో వద్ద 1/2019 సర్క్యులర్ అమలుకు రిలే నిరాహార దీక్షలు చేపడుతున్నప్పటికీ యాజమాన్యం నుంచి ఎటువంటి స్పందన లేదని యూనియన్ ప్రతినిధులు పి.సుధాకర్, ఏఎన్ రావు, కేఎస్‌వీ రమేష్, వేపాడ శ్రీను వాపోయారు. తక్షణమే స్పందించి తమ సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని ఆర్డీవోను విన్నవించారు. యథావిధిగా కాంప్లెక్స్ ఎదుట రిలే నిరాహార దీక్ష కొనసాగింది.

ఏయూ ఇంజనీరింగ్ ఎంట్రన్స్ టెస్ట్‌కు 93.46 శాతం హాజరు

విశాఖపట్నం, మే 5 (ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ కోర్సుల్లో (సెల్ఫ్ సపోర్టు) ప్రవేశాలకు సోమవారం ఆంధ్ర విశ్వవిద్యాలయం నిర్వహించిన ఆఈట్-2025 (ఆంధ్ర యూనివర్సిటీ ఎంట్రన్స్ టెస్ట్)కు 93.46 శాతం మంది విద్యార్థులు హాజరయ్యారు. ప్రవేశ పరీక్షకు మొత్తం 6,028 మంది దరఖాస్తు చేసుకోగా, 5,634 మంది (93.46 శాతం) హాజరయ్యారు. ఏయూ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ జీపీ రాజశేఖర్ గాయత్రీ విద్యాపరిషత్ డిగ్రీ, పీజీ కాలేజీ, లంకపల్లి బుల్లయ్య కాలేజీల్లో పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు.

ప్రజా సమస్యలపై పోరాడదాం

వైసీపీ కేడర్‌కు శాసన మండలి ప్రతిపక్ష నేత బొత్స పిలుపు

కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత ఒక్క పింఛన్ కూడా మంజూరు చేయలేదని విమర్శ



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ బొత్స, వేదికపై అమర్‌నాథ్, ధర్మశ్రీ, సత్యవతి తదితరులు

అనకాపల్లి టౌన్, మే 5 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలపై పోరాటానికి కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేస్తున్నామని శాసనమండలి విపక్ష నేత బొత్స సత్యనారాయణ చెప్పారు. సోమవారం ఇక్కడ ఒక ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో జరిగిన వైసీపీ జిల్లా స్థాయి సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో సమావేశాలు ఏర్పాటు చేసి ఆయా ప్రాంతాల్లో నెలకొన్న ప్రజా సమస్యలపై దృష్టి సారించాలని కేడర్‌కు సూచించారు. కూటమి అధికారంలోకి వచ్చి 11 నెలలు కావస్తున్నప్పటికీ అర్హులైన పేదలకు పింఛన్‌లు మంజూరు చేయలేదని అన్నారు. భర్త చనిపోతే ఆ పింఛన్‌ను భార్యకు ఇవ్వాలని జీవో విడుదల చేయడం మినహా కొత్తగా ఎవరికీ పింఛన్ మంజూరు చేయడం లేదన్నారు. రైతుల సమస్యలను ఈ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. రోడ్లపై గోతుల పూడ్చి వేత ప్రకటలు పూర్తిగా అమలు కాలేదన్నారు. వైసీపీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్ మాట్లాడుతూ, పార్టీ అధికారంలో వున్నప్పుడు సంక్షేమ పథకాలను వలంటీర్ల ద్వారా అందజేయడం వల్ల కార్యకర్తల్లో నిరాశ, నిస్పృహ నెలకొన్నాయని అన్నారు. ఎన్నికలు ఎప్పుడు జరిగినా వైసీపీ అధికారంలోకి వచ్చి, జగన్ సీఎం అవుతారని, అప్పుడు కార్యకర్తలకు అధిక ప్రాధాన్యం ఇస్తామని చెప్పారు. ఈ నెలాఖరునాటికి పార్టీ మండల కమిటీలు, జూలై 31నాటికి గ్రామకమిటీలు, అక్టోబరు 31నాటికి బూత్ కమిటీల నియామకాలు పూర్తికావాలని అన్నారు. అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గం సమన్వయకర్త కరణం ధర్మశ్రీ అధ్యక్షతన జరిగిన

ఈ సమావేశంలో ప్రాంతీయ సమన్వయకర్త కురసాల కన్నబాబు, పార్లమెంట్ పరిశీలకులు శోభా హైమావతి, మాజీ మంత్రి బూడి ముత్యాలనాయుడు, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, మాజీ ఎంపీ డాక్టర్ సత్యవతి, మాజీ ఎమ్మెల్యేలు కన్నబాబు రాజు, అదీప్‌రాజ్, పెట్ల ఉమాశంకర్ గణేశ్, కంబాల జోగులు, అనకాపల్లి అసెంబ్లీ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్, నాయకులు బొడ్డేడ ప్రసాద్, విశాఖ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు తదితరులు పాల్గొన్నారు.

నూకాంబిక ఆలయ హుండీ ఆదాయం రూ.34.8 లక్షలు



హుండీ ఆదాయం లెక్కిస్తున్న భక్తులు

అనకాపల్లి టౌన్, మే 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక నూకాంబిక అమ్మవారి ఉత్సవ మండపంలో సోమవారం హుండీల కానుకల లెక్కింపు జరిగింది. ఏప్రిల్ 16వ తేదీ నుంచి ఈ నెల ఐదో తేదీ వరకు భక్తులు సమర్పించిన ముడుపులు, మొక్కుబడుల ద్వారా రూ.34,80,099 నగదు, 27.5 గ్రాముల బంగారం, 601 గ్రాముల వెండి వచ్చాయని ఆలయ ఈవో వెంపలి రాంబాబు, ఉత్సవ కమిటీ చైర్మన్ పీలా నాగశ్రీను తెలిపారు.

పరవాడ సంతబయలు వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి

పరవాడ, మే 5 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం పరవాడ సంతబయలు వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. ఇటీవల కాలంలో అర్ధరాత్రి సమయంలో పలు దుకాణాలు అగ్నిప్రమాదాలకు గురికావడం వెనుక ఆకతాయిలు, గంజాయి బ్యాచ్ హస్తం ఉందని ఆరోపిస్తున్నారు. ఇప్పటి వరకు ఏడు ప్రమాదాలు జరగ్గా, అవన్నీ అర్ధరాత్రి దాటాకే జరిగాయని, దీనివల్ల లక్షలాది రూపాయలు నష్టం వాటిల్లిందని చెబుతున్నారు. కావాలనే నిప్పు పెట్టడంతో దుకాణాలు అగ్నికి ఆహుతయ్యాయని వాపోయారు. ఇలాగైతే సంతబయలు వద్ద వ్యాపారాలు చేయలేమని దుకాణదారులు చెబుతున్నారు. సీసీ కెమెరాలు ఉన్నట్లయితే ఏ సంఘటన జరిగినా అందుకు కారణాలు తెలుస్తాయని అంటున్నారు. దీని దృష్టిలో పెట్టుకొని పంచాయతీ, పోలీస్ అధికారులు సంతబయలు వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటుకు సత్వరమే చర్యలు చేపట్టాలని విన్నవిస్తున్నారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్ బాధిత కుటుంబానికి సాయం

సబ్బవరం, మే5 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి సాయినగర్ కాలనీలో ఇటీవల విద్యుత్ షార్టు సర్క్యూట్ కారణగా ఇల్లు దగ్ధం కావడంతో సర్వం కోల్పోయిన జనసైనికుడు యెన్నింటి లీలతేజ కుటుంబానికి ఆ పార్టీ నాయకులు అండగా నిలిచారు. బాధిత కుటుంబాన్ని సోమవారం పరామర్శించిన నాయకులు బలిరెడ్డి అప్పారావు, కర్రి కనకరాజు, బైలపూడి దేముడుబాబు, గండి దుర్గాప్రసాద్ రూ. పది వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో బంతికోళ్ల పద్మ, తాటిపాముల శేఖర్, జెట్టి ప్రసాద్, పల్లి మంగరాజు, కాపుశెట్టి దుర్గాప్రసాద్, బండారు శ్రీను, వాకాడ తేజ తదితరులు పాల్గొన్నారు.

శంకరం ఎస్సీ కాలనీ వెనుక వైపు అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

చెట్టుకు ఉరివేసినట్టు ఉండడంతో పోలీసులకు ఫిర్యాదు

కొత్తూరు, మే 5 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి మండలంలోని శంకరం ఎస్సీ కాలనీ వెనుక వైపు ఉన్న కోళ్ల ఫారం వద్ద చింతచెట్టుకు ఉరేసుకొని ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఇందుకు సంబంధించి రూరల్ అదనపు ఎస్ఐ జి.నాగేశ్వరరావు, స్థానికులు తెలిపిన వివరాలివి. త్రిపుర రాష్ట్రం వెస్టు త్రిపుర జిల్లాకు చెందిన జితిన్ ముండ (39) అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్టు సోమవారం పోలీసులకు సమాచారం అందింది. దీంతో రెవెన్యూ అధికారులు, పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. అతడి వద్ద ఆధార్‌కార్డు బయటపడింది. అయితే ఈ ఘటన పలు అనుమానాలకు తావిస్తోంది. ఇతనిని ఎవరైనా హతమార్చి ఇక్కడకు తీసుకొచ్చి చెట్టు కొమ్మకు కట్టివేసి ఉండవచ్చని స్థానికులు ఆరోపిస్తున్నారు. పూర్తి వివరాల సేకరణలో పోలీసులు నిమగ్నమయ్యారు. రెవెన్యూ అధికారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ చెప్పారు. మృతదేహాన్ని అనకాపల్లి ప్రభుత్వాసుపత్రి మార్చురీలో భద్రపరిచారు.

మహిళ మెడలోంచి రెండు తులాల పుస్తెల తాడు అపహరణ

కశింకోట, మే 5 (ఆంధ్రజ్యోతి) : నూతనగుంటపాలెం పాల కేంద్రం వద్ద మహిళ మెడలోంచి పుస్తెల తాడును అపహరించుకుపోయిన సంఘటన సోమవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం వివరాలివి. నూతనగుంటపాలెం గ్రామానికి చెందిన ధనరెడ్డి బాబూరావు, అతని భార్య సూరిమణి పాల కేంద్రం వద్ద పాలు పోసేందుకు ద్విచక్ర వాహనంపై వెళ్లారు. భర్త పాలు పోసేందుకు డెయిరీ లోపలకు వెళ్లగా, రోడ్డుపై ఆయన భార్య సూరిమణి ఉన్నారు. ఇంతలో గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు ద్విచక్ర వాహనంపై అక్కడకు వచ్చి ఆమె మెడలో ఉన్న రెండు తులాల బంగారపు పుస్తెల తాడును తెంచుకుపోయారు. ఆమె కేకలు వేయడంతో అప్పటికే వారు ఎలమంచిలి వైపు వెళ్లిపోయారని బాధితులు వాపోయారు.

సీఎంను కలిసిన డీసీఎంఎస్ చైర్మన్



చంద్రబాబుతో కరచలానం చేస్తున్న బాలాజీ

తుమ్మపాల, మే 5 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, విద్యాశాఖ మంత్రి లోకేశ్‌లను సోమవారం ఉండవల్లిలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, డీసీఎంఎస్ చైర్మన్ కోట్ని బాలాజీ కుటుంబ సభ్యులతో కలిశారు. ఇటీవల ఉమ్మడి విశాఖ జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ (డీసీఎంఎస్) చైర్మన్ పదవిని చేపట్టడంతో వారికి బాలాజీ కృతజ్ఞతలు తెలియజేశారు. సహకార మార్కెటింగ్ సొసైటీ బలోపేతానికి కృషి చేయడంతో పాటు పార్టీ అభివృద్ధికి పాటు పడతానని బాలాజీ వారికి వివరించారు.

చోరీల పట్ల అప్రమత్తంగా ఉండాలి : డీఎస్పీ



సదస్సులో మాట్లాడుతున్న డీఎస్పీ విష్ణుస్వరూప్

పరవాడ, మే 5 (ఆంధ్రజ్యోతి) : దొంగతనాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పరవాడ డీఎస్పీ వల్లెం విష్ణుస్వరూప్ సూచించారు. గొర్లివానిపాలెం పంచాయతీ పరిధి ఫోర్టకో టౌన్‌షిప్‌లో సోమవారం రాత్రి స్థానికులతో ఏర్పాటు చేసిన సదస్సులో మాట్లాడారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇంటి నుంచి బయటకు వెళ్లేటప్పుడు విలువైన వస్తువులను ఇంట్లో ఉంచరాదన్నారు. అపరిచిత వ్యక్తులు కంట పడితే తక్షణమే పోలీసులకు సమాచారమివ్వాలని చెప్పారు. టౌన్‌షిప్‌లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్‌ను పాటించాలని స్పష్టం చేశారు. సీఐ ఆర్.మల్లికార్జునరావు, ఫోర్టకో టౌన్‌షిప్ అధ్యక్షుడు కాశీ ప్రసాద్, సెక్రటరీ అమరేంద్ర, టౌన్‌షిప్ వాసులు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయం వద్ద ఉపాధ్యాయుల ధర్నా

ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో డిమాండ్ల పరిష్కారానికి నినాదాలు



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఉపాధ్యాయులు

అనకాపల్లి టౌన్, మే 5 (ఆంధ్రజ్యోతి) : సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఇక్కడి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం ఉపాధ్యాయులు ధర్నా నిర్వహించారు. సీపీఎస్, జీపీఎస్ రద్దు చేసి మెమో నంబరు 57 ప్రకారం డీఎస్సీ వారికి వెంటనే ఓపీఎస్ అమలు చేయాలని, 12వ పీఆర్సీ కమిషన్‌ను నియమించి ఐఆర్ ప్రకటించాలని, పెండింగ్‌లో ఉన్న మూడు డీఏలను తక్షణమే ప్రకటించాలని, 11వ పీఆర్సీ బకాయిలతో పాటు ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సిన అన్ని రకాల ఆర్థిక బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రతి ప్రాథమిక పాఠశాలకు విద్యార్థుల సంఖ్యతో నిమిత్తం లేకుండా కనీసం రెండు ఎస్‌జీటీ పోస్టులు ఉండే విధంగా చర్యలు చేపట్టాలని నినాదాలు చేశారు.

ఫెడరేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు వై.శ్రీనివాస్, అనకాపల్లి మండలశాఖ అధ్యక్ష, కార్యదర్శులు కొణతాల గణేష్, డి.నూకేష్, బేగం, సూర్యనారాయణ, కిరీటి, వివిధ మండలాల అధ్యక్ష, కార్యదర్శులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు. ఈ ఆందోళనకు ఎస్ఎల్‌టీఏస్ అధ్యక్షులు రామకృష్ణ, గౌరవాధ్యక్షులు అప్పలరాజు సంఘీభావం తెలిపారు.

సమస్యలపై నిరసన స్వరాలు



మోకాళ్లపై నిలిచి నిరసన తెలియజేస్తున్న సీహెచ్‌వోలు

అనకాపల్లి టౌన్, మే 5 (ఆంధ్రజ్యోతి) : కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల సమ్మెలో భాగంగా ఎనిమిదో రోజు సోమవారం ఎన్‌హెచ్ఎం కార్యాలయం వద్ద మోకాళ్లపై నిలిచి నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఏపీ కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ ఫెడరేషన్ జిల్లా కన్వీనర్ వీవీ శ్రీనివాసరావు మాట్లాడుతూ సీహెచ్‌వోలను పర్మినెంట్ చేయాలని, ఉద్యోగులకు భద్రత కల్పించి, అందరు ఉద్యోగులతో సమానంగా వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే చర్యలు జరిపి సమస్యలకు పరిష్కారం చూపాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రతినిధులు రేవతి, భవానీ, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

'అంగన్‌వాడీ కార్యకర్తపై వేధింపులు తగదు'

పరవాడ, మే 5 (ఆంధ్రజ్యోతి) : రావాడ పంచాయతీ ధర్మారాయుడుపేట అంగన్‌వాడీ కేంద్రంలో పనిచేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్త కె.ఉమాపై స్థానిక సర్పంచ్, ఐసీడీఎస్ సీడీపీవో వేధింపులకు పాల్పడడం మానుకోవాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం ఇక్కడి మండల పరిషత్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీలు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ సర్పంచ్ రాజకీయ బెదిరింపులకు పాల్పడడం దారుణమన్నారు. రాజకీయ ఆధిపత్యం కోసం సర్పంచ్ అంగన్‌వాడీ కార్యకర్త ఉమాకు ఐసీడీఎస్ సీడీపీవో ద్వారా మెమో జారీ చేయించారని ఆరోపించారు. సదరు మెమో కాపీని వాట్సాప్ గ్రూపుల్లో పెట్టి మానసికంగా వేధిస్తున్నారని పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎంపీడీవో కె.ధర్మారావుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ ప్రతినిధులు సీహెచ్. దేవి, ఎం.అమ్మాజీ, రత్నం, వెంకటలక్ష్మి, పార్వతి, రాణి తదితరులు పాల్గొన్నారు.